ప్రజాశక్తి
శుక్రవారం 2 మే 2025
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న త్రిసభ్య కమిటీ సభ్యులు

'సింహాచలం' ప్రమాదంపై విచారణ ప్రారంభం

- ఘటనా స్థలాన్ని పరిశీలించిన త్రిసభ్య కమిటీ
- కాంట్రాక్టరు, ఇంజినీర్లపై ప్రశ్నల వర్షం
- నాసిరకం పనులే ఏడుగురి ప్రాణాలు తీసినట్టు అంచనా ?

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, గోపాలపట్నం విలేకరి

సింహాచలంలో అప్పన్న చందనోత్సవం సందర్భంగా గోడ కూలి ఏడుగురు మరణించిన ఘోర దుర్ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీ విశాఖలో తన విచారణను గురువారం నుంచి ప్రారంభించింది. మున్సిపల్ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ నేతృత్వాన రాష్ట్ర ఈగల్ విభాగాధిపతి ఐజి ఆకే రవికృష్ణ, జలవనరుల శాఖ ఇంజినీరు ఇన్ చీఫ్ ఎం.వెంకటేశ్వరరావుతో కూడిన ఈ కమిటీ కొండపై గోడ నిర్మాణం చేసిన కాంట్రాక్టరు, డిఇ, ఇఇలపై ప్రశ్నల వర్షం కురిపించింది. గోడ నిర్మాణం పిల్లర్ లేకుండా చేశానని కాంట్రాక్టరు అంగీకరించాడు. నిర్మాణ సామగ్రిని ల్యాబ్‌ల్లో పరీక్షించకుండా చందనోత్సవం ఉందంటూ తనపై ఇంజినీర్లు తెచ్చిన ఒత్తిడి వల్లే పనులు చేశానని ఆయన చెప్పుకొచ్చాడు. తాను పనిని మధ్యలో ఆపేసినా ఒప్పుకోలేదని, నాలుగు రోజుల్లో నిర్మాణం జరిగేలా చేశారని కమిటీ ఎదుట సదరు కాంట్రాక్టరు కుండబద్దలుగొట్టాడు. ఆయన చెప్పిన అన్ని విషయాలనూ త్రిసభ్య కమిటీ సభ్యులు తమ నోట్సుల్లో రాసుకున్నారు. విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేందిరప్రసాద్, విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఈ కమిటీతోపాటే కొండపై ఘటనా స్థలాన్ని పరిశీలించారు. (ప్రధాన వార్త మెయిన్‌లో..)

ప్రమాదాన్ని ప్రకృతిపై నెట్టేయడం

బాధ్యతారాహిత్యమే

సింహాచలం ఘటనపై సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సింహాచలం దేవస్థానంలో రక్షణ గోడ కూలిపోవడానికి ప్రకృతి వైపరీత్యమే కారణమని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రకటించడం ఆయన బాధ్యతారాహిత్యాన్ని తెలియజేస్తోందని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంత్రి వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. వర్షాలు వచ్చినప్పుడు కొండ మట్టి చరియలు విరిగి కింద పడకుండా ఉండటానికే రక్షణ గోడలు నిర్మిస్తారన్నారు. ఆ రక్షణ గోడే కూలిపోయి ఏడుగురి నిండు ప్రాణాలు గాల్లో కలిసిపోయి, వారి కుటుంబాలను తీవ్ర దుఃఖ సాగరంలోకి నెట్టబడ్డాయన్నారు. భక్తులను, విశాఖపట్నం ప్రజలను ఈ ఘటన తీవ్ర ఆవేదనకు గురిచేసిందని జగ్గునాయుడు తెలిపారు. గోడ ఎత్తును బట్టి భూమి లోపల అవసరమైన లోతు నుంచి బలమైన ఇనుము, సిమెంట్ కాంక్రీట్‌తో పునాదులు వేసి రక్షణ గోడ నిర్మిస్తారన్నారు. ఒకవేళ గోడవైపు నీరు వస్తే గోడకు నష్టం జరగకుండా నీరు బయటకు పోయే విధంగా గోడ లోపల పైపులతో రంధ్రాలు ఏర్పాటు చేస్తారన్నారు. ఈ గోడ నిర్మాణంలో ఈ కనీస పద్ధతి పాటించలేదని, సిమెంట్ కాంక్రీట్‌తో కాకుండా ఇటుకలతో గోడ నిర్మించినట్లు అర్థమవుతోందని తెలిపారు. ఇదే గోడ కూలిపోవడానికి ప్రధాన కారణంగా మీడియాలో వచ్చిందన్నారు. గోడ కొత్తగా నిర్మించింది కాబట్టి వర్షపు నీటికి కూలిపోయిందని మంత్రి వ్యాఖ్యానించారని, గోడ కొత్తదైతే ఆ ప్రాంతం గుండా భక్తులను ఎందుకు అనుమతించారని ప్రశ్నించారు. వర్షం కురుస్తున్నప్పుడు ముందస్తు జాగ్రత్తగా భక్తులను ఆ ప్రాంతం నుండి ఎందుకు ఖాళీ చేయించలేదన్నారు. వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే ఈ దుర్ఘటనను మంత్రి ప్రకృతి పైకి నెట్టేస్తున్నారన్నారు. ఈ దుర్ఘటనపై సమగ్ర విచారణకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు త్రిసభ్య కమిటీని వేశారని, ఆ కమిటీ సమగ్ర విచారణ జరిపి వాస్తవ పరిస్థితులను ప్రభుత్వం, ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. కమిషన్ విచారణ ప్రారంభించక ముందే మంత్రి ప్రమాద కారణాలను విలేకరుల సమావేశంలో ప్రకటించేశారన్నారు. అలాంటప్పుడు రాష్ట్ర ప్రభుత్వం వేసిన కమిటీకి విలువ ఏముంటుందన్నారు. మంత్రి ప్రకటించినట్లు కమిషన్ రిపోర్ట్ మిగతా 2లో..

మెడికల్‌రిప్స్‌కు చట్టం అమలు చేయాలి

వార్త 2లో..

7న కన్యకాపరమేశ్వరి జయంతి

వార్త 2లో..

ప్రాథమిక విద్యకు బాల్యం పాఠశాలలు పునాది కావాలి

వార్త 2లో..

10 వేల రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్లు ఏర్పాటు

- వినియోగదారులకు రూ.77 కోట్లు లబ్ధి
- ఎపిఇపిడిసిఎల్ సిఎండి పృథ్వీతేజ్ ఇమ్మడి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో: ఎపిఇపిడిసిఎల్ పరిధిలోని వినియోగదారులకు 10 వేల రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసి సరికొత్త రికార్డు సృష్టించామని సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో అందిస్తున్న పిఎం సూర్యఘర్ పథకానికి ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ గృహ వినియోగదారుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోందని తెలిపారు. ఇప్పటివరకు 33,556 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన పదివేల రూఫ్ టాప్‌సోలార్ ప్లాంట్లను గహ వినియోగదారులకు ఏర్పాటు చేసాశామన్నారు. శ్రీకాకుళం జిల్లాలో 3282 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ ప్లాంట్లు 1066 మందికి, పార్వతీపురం మన్యంలో 135 మందికి, విజయనగరంలో 935 మంది, విశాఖపట్నం 1501, అనకాపల్లి 757, అల్లూరి జిల్లాలో ఆరుగురికి, డాక్టర్ అంబేద్కర్ కోనసీమలో 561, కాకినాడ మిగతా 2లో..

విశాఖలో కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

అనకాపల్లిలో జరిగిన భారీ ర్యాలీలో లోకనాథం, శంకరరావు తదితరులు

కార్మిక హక్కుల రక్షణకు ఉధృత ఉద్యమాలు

- మేడే వేడుకల్లో వక్తలు
- విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో వాడవాడలా ఎగిరిన ఎర్రజెండా

మేడే స్ఫూర్తితో కార్మిక హక్కుల రక్షణ కోసం ఉధృత ఉద్యమాలకు సిద్ధం కావాలని కార్మిక నేతలు పిలుపునిచ్చారు. ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే వేడుకలు గురువారం వాడవాడలా ఉత్తేజంగా సాగాయి. ఎర్రజెండాలు రెపరెపలాడాయి. కార్మికులు పిడికిలెత్తి నినదించారు. విశాఖ జిల్లాలో 450కుపైగా కేంద్రాల్లోనూ, అనకాపల్లి జిల్లాలో 180 కేంద్రాల్లోనూ సిఐటియు ఆధ్వర్యాన కార్యక్రమాలు జరిగాయి. విశాఖ దొండపర్తిలోని రైల్వే డిఆర్ఎం కార్యాలయం నుంచి ఆశీలమెట్ట వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడారు. అనకాపల్లి జిల్లా కేంద్రంలో జరిగన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కె.లోకనాథం ప్రసంగించారు. పట్టణంలో బాటా సెంటర్ నుంచి నాలుగురోడ్ల కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. (వార్తలు లోపలి పేజీల్లో...)

మొదటి పేజీ తరువాయి..

ప్రమాదాన్ని ప్రకృతిపై నెట్టేయడం బాధ్యతారాహిత్యమే

ఉండాలని ప్రభుత్వం భావిస్తుందా ? అని జగ్గనాయుడు ప్రశ్నించారు. రక్షణ గోడ నిర్మాణం వెనుక అనేక అక్రమాలు చోటు చేసుకున్నట్లు మీడియాలో వార్తలు వస్తున్నాయన్నారు. సింహాచలం దేవస్థానాన్ని ప్రసాద్ పథకం కింద అభివృద్ధి చేసేందుకు కేంద్రం కేటాయించిన రూ.54.04 కోట్ల నిధుల నుంచి ఈ గోడ నిర్మాణ పనులు జరిగినట్లు, ప్రసాద్ పథకం పనులకు 2024 మార్చి 7న వర్చువల్ విధానంలో దేశ ప్రధాని శంకుస్థాపన చేసినట్లు పత్రికల్లో వచ్చిందన్నారు. భక్తుల రక్షణకు నిర్మిస్తున్న గోడలు భక్తుల ప్రాణాలను హరిస్తుంటే దీనికి ప్రభుత్వం బాధ్యత వహించదా ? అని ప్రశ్నించారు. నాసిరకంతో, హడావిడిగా తక్కువ సమయంలో గోడ నిర్మాణం కాంట్రాక్టర్ జరిపితే దేవస్థానం అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం ఎందుకు నివారించలేదన్నారు. ఒక కాంట్రాక్టర్‌ను నియంత్రించలేని స్థితిలో ప్రభుత్వం ఉందా ? అని ప్రశ్నించారు. పై నుండి కింద వరకూ కమీషన్లు, పర్సంటేజీలు, అవినీతితో నాసిరకం నిర్మాణాలు జరుగుతుంటే కళ్ళప్పగించి చూస్తోందా ? అని అడిగారు. ఈ ప్రశ్నలకు రాష్ట్ర ప్రభుత్వం, దేవాదాయ శాఖ మంత్రి ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఈ దుర్ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపించి, వాస్తవాలను ప్రజల ముందుంచాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన దర్యాప్తు బృందంపై ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లూ అవకాశం ఇవ్వరాదని, ప్రభావితం చేయరాదని అన్నారు. దుర్ఘటనలో మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున నష్టపరిహారం చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి పర్మినెంట్ ఉపాధి కల్పించాలని కోరారు.

10 వేల రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్లు ఏర్పాటు

1139, తూర్పుగోదావరి 1199, పశ్చిమగోదావరి 1228, ఏలూరు జిల్లాలో 1473 మందికి సోలార్ ప్లాంట్లను నిర్మించామని వివరించారు. ఈ పథకాన్ని వినియోగదారులకు మరింత చేరువ చేసేందుకు విస్తృతస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పథకంలో భాగంగా ఒక కిలోవాట్ సామర్థ్యం కలిగిన సోలార్‌రూఫ్ టాప్‌ప్లాంట్ ఏర్పాటు చేసుకోవాలనుకొనే వినియోగదారులు తమ ఇంటి పైకప్పుపై కనీసం 100 చదరపు అడుగుల స్థలం కలిగి ఉండాలన్నారు. ఒక కిలోవాట్ సామర్థ్యం కలిగిన సోలార్‌ప్లాంట్ ఏర్పాటు చేసుకొన్నవారికి 30,000, 2 కిలోవాట్లకు 60వేలు, 3 కిలోవాట్లకు గరిష్ఠంగా రూ.78వేలు వరకు సబ్సిడీ అందిస్తున్నామని తెలిపారు. 500 కిలోవాట్ల వరకు కిలోవాట్‌కు 18,000 రూపాయల చొప్పున సబ్సిడీ అందిస్తున్నామన్నారు. అతితక్కువ వడ్డీకి బ్యాంకుల నుంచి రుణసదుపాయం కూడా కల్పిస్తున్నామ న్నారు. ఇందుకోసం వినియోగ దారులు 'పిఎంసూర్యఘర్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని మరిన్ని వివరాలకు www.apeasternpower.com వెబ్‌సైట్ ను సందర్శించవచ్చని తెలిపారు.

7న కన్యకాపరమేశ్వరి జయంతి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : వన్‌టౌన్ ప్రాంతంలో 148 సంవత్సరాల చరిత్ర గల కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో ఈనెల 7 న అమ్మవారి 1075 వ జయంతి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు దేవాలయ సంఘ అధ్యక్షులు అరిశెట్టి దినకర్ తెలిపారు. గురువారం ఆలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆరోజు తెల్లవారుజాము 3 గంటలకు సుప్రభాతంతో మొదలై ప్రత్యేక క్షీరాభిషేకం అమ్మవారికి సువర్ణవస్త్రా లంకరణ, స్వర్ణపుష్పాలతో ప్రత్యేకపూజలు, 102 మంది మహిళలతో సామూహిక కుంకుమ పూజలు, వాసవి మూలమంత్ర హోమంతో పాటు మధ్యాహ్నం 12 గంటలకు అన్నసమారాధన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆ రోజు సాయంత్రం 5 గంటలకు జగదాంబజంక్షన్ అంబికా బాగ్ నుండి కన్యకా పరమేశ్వరి దేవాలయం వరకు శోభాయాత్ర ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. శోభాయాత్రలో పలువురు భక్తులు ఏకరూప దుస్తులతో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికను విడుదల చేశారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి పెనుగొండ కామరాజు,కోశాధికారి దోమవెంకటబాలాజీ కుమార్, బొడ్డ రఘు, పెనుగొండ చంద్రశేఖర్, కెఎంవిఎస్ టి రామకృష్ణ, పాలూరి సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యకు బాల్యం పాఠశాలలు పునాది కావాలి

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ :ప్రాథమిక విద్యకు జీవీఎంసీ బాల్యం పాఠశాలలు పునాది కావాలని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం ఆయన జివియంసి ప్రధాన కార్యాలయంలో బాల్యం ఆధ్యాపకులు, సూపర్ వైజర్ల తో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ, 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి జీవీఎంసీ బాల్యం విద్యా కేంద్రాల్లో నమోదుశాతాన్ని పెంచేలా ఈ వేసవి సెలవులలో ప్రణాళికలను చేపట్టాలని ఆదేశించారు. బాల్యం విద్యా కేంద్రాలలో ఉన్నతమైన పూర్వ ప్రాథమిక విద్య అందిస్తూ తద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మొదటి తరగతిలో పిల్లలను చేర్పించేలా విద్యార్థులను సంసిద్ధం చేయాలని అందుకు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. 3 నుంచి 5 సంవత్సరాల విద్యార్థులకు ఉత్తమమైన ఆకర్షితమైన పూర్వ ప్రాథమిక విద్యను అందించే విధంగా బాల్యం విద్యాకేంద్రాలు పని చేయాలన్నారు.

అలాగే పిల్లలు బాల్యం కేంద్రంలో చేర్పించేందుకు ప్రభుత్వం వారికి కల్పించిన మౌలిక సదుపాయాలు తల్లిదండ్రులకు వివరిస్తూ అవగాహన కల్పించాలని ఆదేశించారు. బాల్యం విద్యా కేంద్రాల యొక్క పనితీరు ప్రైవేటు కాన్వెంట్ల కంటే మెరుగ్గా ఉండాలని, బాల్యం కేంద్రాలను స్వయంగా సందర్శిస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో భాగంగా బాల్యం విద్యా కేంద్రాల్లో నమోదు శాతం పెంచేందుకు, బాల్యం విద్యా కేంద్రాలలో ఉచితంగా అందించే విద్య ఇతర సౌకర్యాల వివరాలతో కూడిన 'కరపత్రం ఆవిష్కరించి, సంబంధిత రికార్డులను సిబ్బందికి మేయర్ అందించారు. కార్యక్రమంలో జివియంసి అదనపు కమిషనర్ ఎస్.ఎస్. వర్మ, బాల్యం విద్యాపథకం ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ మోహన్‌కుమార్ ఆవుపాటి, బాల్యం విద్యా కేంద్రాల్లో పనిచేసే బాల్యం అధ్యాపకులు, బాల్యం సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

నగరంలో మేడే సంబరాలు

మద్దిలపాలెం జోన్‌లో సిఐటియు ఆధ్వర్యాన..

జివిఎంసి గాంధీ విగ్రహం సమీపాన ఎఐటియుసి ఆధ్వర్యాన..

విశాఖ కలెక్టరేట్ : మేడే స్ఫూర్తితో కార్మిక హక్కుల రక్షణ కోసం ఉద్యమానికి కార్మికవర్గం సిద్ధం కావాలని, అందుకు ఈ నెల 20న తలపెట్టిన అఖిల భారత సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు పిలుపునిచ్చారు. మేడే సందర్భంగా గురువారం దొండపర్తిలోని రైల్వే డిఆర్ఎం కార్యాలయం నుంచి ఆశీలమెట్ట వరకు సిఐటియు విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యాన భారీ ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడే చరిత్రను కార్మికులకు వివరించారు. పోరాడి సాధించిన కార్మిక హక్కులు, చట్టాలపై కేంద్ర బిజెపి ప్రభుత్వం పెద్దఎత్తున దాడికి దిగిందన్నారు. 29 కార్మిక చట్టాలను 4 లేబర్‌కోడ్లుగా మార్చి యజమానులకు ఊడిగం చేస్తోందని విమర్శించారు. ఎల్ అండ్ టి సంస్థ యజమాని 16 గంటలు పనిచేయాలని చెప్పడం దీనికి నిదర్శనమన్నారు. దేశంలో ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టబెడుతున్నారన్నారు. పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికుల ఉపాధికి పెద్దఎత్తున గండిగొడుతున్నారని తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం కాంట్రాక్ట్ కార్మికులను అన్యాయంగా తొలగించడానికి పూనుకుందని గుర్తుచేశారు. కార్మిక చట్టాలున్నా బిల్డింగ్, ఆటో, ముఠా, తోపుడుబండ్లు వంటి అనేక మంది అసంఘటితరంగ కార్మికులకు నేడు ఆ చట్టాలు వర్తించడం లేదన్నారు. నేడు వాటిని రద్దు చేసి లేబర్ కోడ్స్ అమలు జరిపితే ఉన్న హక్కులూ హరించుకుపోతాయన్నారు. ఈ నేపథ్యంలో మేడే స్ఫూర్తితో ఈ నెల 20న లేబర్ కోడ్స్ రద్దుచేసే విధంగా సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మోడీ విధానాలనే అమలు చేస్తోందన్నారు. స్కీం వర్కర్లపై భారాలు మోపుతోందన్నారు. వేతనాలు పెంచకుండా వారితో వెట్టి చాకిరీ చేయిస్తోందన్నారు. కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి పి.మణి, నాయకులు పి.వెంకటరెడ్డి, ఎం.సుబ్బారావు, పి.వెంకటరావు, వి.కృష్ణారావు, జి.అప్పలరాజు, కె.కుమారి, టి.నూకరాజు, టి.నాయుడు, ఆర్.నాయుడు, వై.రాజు, అప్పలనాయుడు, కె.శేఖర్, ఎ.సీతాలక్ష్మి, ఎంసిహెచ్.అప్పడు, కెజె.అప్పారావు, శ్రీనివాస్, ఝాన్సీ, మల్లీశ్వరి, సీతారత్నం, వి.నరేంద్ర కుమార్ పాల్గొన్నారు.

జగదాంబ దరి సిఐటియు జిల్లా కార్యాలయం వద్ద సంఘం సీనియర్ నాయకులు పి.వెంకట రెడ్డి, వై.రాజు పతాకావిష్కరణ చేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడారు. ఎం.సుబ్బారావు, టి.నూకరాజు, పి.మణి, జి.అప్పలరాజు, జి.పోలేశ్వరరావు, ఎం.సూరీడు పాల్గొన్నారు.

కంచరపాలెం మెట్టు నుంచి ఫ్లై ఓవర్ మీదుగా జ్ఞానాపురం జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీ వరకూ ఐఎఫ్‌టియు ఆధ్వర్యాన ర్యాలీ చేపట్టారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతిరావు అధ్యక్షతన సభ నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడారు.

ఎఐటియుసి ఆధ్వర్యంలో నగరంలో 32 చోట్ల మేడే ఉత్సవాలు నిర్వహించారు. జివిఎంసి గాంధీ పార్క్ వద్ద బట్టల వ్యాపారస్తుల ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణమూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంవిపి కాలనీ : సిపిఎం మద్దిలపాలెం కార్యాలయం వద్ద ఎర్రజెండాను ఆవిష్కరించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు మాట్లాడారు. కె.కుమారి, ఎం.చంటి, జివిఎన్.చలపతి, జివి.రమణ, రాజు, నాయుడు పాల్గొన్నారు.

మద్దిలపాలెం ఏరియాలోని 14 నుండి 24వ వార్డు మున్సిపల్ కార్యాలయాల పరిధిలోని 45 సెంటర్లలో పతాకావిష్కరణలు జరిగాయి.

మెడికల్‌రిప్స్‌కు చట్టం అమలు చేయాలి

ప్రజాశక్తి- విశాఖకలెక్టరేట్: మెడికల్ రిప్రజెంటేటివ్స్‌కి సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ చట్టం అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ రాష్ట్ర ఉపాధ్యక్షులు యు.వి.కష్ణయ్య డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ జిల్లా మహాసభ గురువారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కృష్ణయ్య మాట్లాడుతూ మెడికల్ రిప్రజెంటేటివ్స్‌కి సంబంధించిన సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ యాక్ట్ అమలు జరపాలని, కొత్తగా వచ్చిన లేబర్ కోడ్స్ వల్ల దీనికి విఘాతం జరిగే ప్రమాదం ఉందని, కనుక ఈ నెల 20న జరగబోయే సార్వత్రిక సమ్మెలో మెడికల్ రిప్రజెంటేటివ్స్ అందరూ పాల్గొనాలని పిలుపుఇచ్చారు. అదేవిధంగా మెడికల్ రిప్రజెంటేటివ్స్‌కు సంబంధించిన సేల్స్‌బేస్ట్ విక్టమైజేషన్స్, సర్వలెన్స్ అంటే మెడికల్ రిప్రజెంటేటివ్స్‌కి వాళ్ల ఉనికిని ట్రాక్ చేయడం, ప్రైవసీకి భంగం కలుగుతుందని, వాళ్లకు సంబంధించిన పని పద్ధతులను సెక్షన్ 2జె వర్తింపజేయాలని, మందుల ధరలు తగ్గించాలన్నారు. కనీస వేతన చట్టం మెడికల్ రిఫ్రిజిరేటర్స్ అమలు చేయాలని, మెడికల్ రిప్రజెంటేటివ్స్ అందరినీ హైలీ స్కిల్ కేటగిరిగా గుర్తించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి కెవిపి చంద్రమౌళి మాట్లాడుతూ మేడే విశిష్టత వివరించారు. నకిలీ నాసిరకం మందులు తయారీదారుల శిక్షించాలని, బ్లాక్‌లో మందులు అమ్మకాలు ఆపాలని డిమాండ్ చేశారు. అనంతరం యూనియన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పి.వి.సుధాకర్, కార్యదర్శిగా డి.ప్రవంత్, కోశాధికారిగా రామారావు, ఉపాధ్యక్షులుగా పి. శ్రీనివాస్, సన్యాసిరావు, సహాయ కార్యదర్శులుగా మహేష్, వర్మ మరో 30 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సంజయ్ కుమార్ మాట్లాడుతూ రాబోయే కాలంలో మెడికల్ రిప్రజెంటేటర్స్ కి సేల్స్ బాధ్యతగా చేస్తూ డిస్ట్రిబ్యూటర్లు మెడికల్ రిప్రజెంట్లను దోచుకుంటున్నారని దీనినీ అరికట్టవలసిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని చెప్పారు. రాష్ట్రకార్యవర్గ సభ్యులు కిరణ్‌కుమార్‌చౌదరి స్టీల్‌ప్లాంట్‌ని విక్రయించవద్దని, స్టీల్‌ప్లాంట్ అమ్మకానికి వ్యతిరేకంగా పోరాడతామని తెలియజేశారు. అధికసంఖ్యలో మెడికల్ రిప్రజెంటేటివ్స్‌తో పాటు ఎఫ్ఎంసిజి రిప్రజెంటేటివ్స్, అనకాపల్లి, నర్సీపట్నం నుంచి నాయకులు పాల్గొన్నారు.

సిహెచ్‌ఒలను రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: వైద్య ఆరోగ్యశాఖలో ఎన్‌హెచ్ఎం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఆయుష్మాన్ లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ అధికారులను రెగ్యులర్ చేయాలని, డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా శుక్రవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు ప్రసన్న, హరిచందన మీడియాతో మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం 6 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సిహెచ్‌ఓ లను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతనం పెంచి చెల్లించాలన్నారు. ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలని, ఇపిఎఫ్‌ను పునరుద్ధరించాలని కోరారు.

ప్రణవ్ గోపాల్‌ను కలిసిన కోన తాతారావు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) ఛైర్మన్‌గా నియమితులైన కోన తాతారావు గురువారం విఎంఆర్డిఎ ఛైర్మన్ ఎంవి ప్రణవ్‌గోపాల్‌ను ఆయన ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉన్న తాతారావు సారధ్యంలో బ్యాంకు అభివృద్ధి పథంలో నడుస్తుందని ఎం.వి. ప్రణవ్ గోపాల్ ఆశాభావం వ్యక్తం చేసారు. రైతులకు బ్యాంకు ద్వారా అండగా ఉండాలని సూచించారు.

దావాసమన్లు

IN THE COURT OF THE HON'BLE III ADDL.CIVIL JUDGE(JUNIOR DIVISION):: GUNTUR
OS No: 129/ 2023

Between:
State Bank Of India, RACPC, Guntur,Rep.by it's Manager-Recovery . ...Plaintiff
And
Chimata Sankara Rao ..... Defendant
To.
Chimata Sankara Rao, S/o.Late Balaji Naidu,R/o.# 51-8-42/7, Nakkavaripalem, Backside Rythu Bazaar,Seethammadhara, Visakhapatnam.

పై నెంబరు దావాను వాది, బ్యాంకుకు రావలసిన బాకీ వసూలు నిమిత్తం దాఖలు చేయగా సదరు దావాలో ప్రతివాది అయిన మీకు పై కోర్టు నుండి దావా సమన్లు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు సమన్లు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని ది:19-06-2025 కి వాయిదా వేసినారు.కావున ఆ రోజున ఉ. గం.10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని లేక మీ వకీలు గారి ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలను తెలుపుకొనగలరు. లేనిచో శ్రీ కోర్టు వారిచే చట్ట ప్రకారం మీ పరోక్షంగా విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది:19-06-2025

కె.వి. ఆర్. హెచ్.ప్రసాద్,
వాది తరపు అడ్వకేట్,
రవీంద్ర నగర్ , గుంటూరు.

'విశాఖ'లో ముగిసిన వర్క్‌ షాప్

ప్రజాశక్తి-వేపగుంట : నరవలోని విశాఖ ఇంజినీరింగ్ కళాశాలలో 'డాటా స్ట్రక్చర్ అండ్ ఇట్స్ అల్గోరిథమ్స్ విత్ టూల్ కిట్'పై కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యాన నిర్వహించిన రెండు రోజుల వర్క్ షాప్ గురువారం ముగిసింది. ఈ వర్క్‌షాప్‌నకు స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ బి.రామకృష్ణ హాజరై డాటా స్ట్రక్చర్ అండ్ ఇట్స్ అల్గోరిథమ్స్ విత్ టూల్ కిట్‌పై ఇంజినీరింగ్ విద్యార్థులకు వివరించారు. పతి ఒక్కరూ ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం రామకృష్ణను కళాశాల చైర్మన్ జి.సత్యనారాయణ, ప్రిన్సిపల్ డాక్టర్ జివి.ప్రదీప్‌వర్మ సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వి.రంగారావు, డాక్టర్ తేజస్విని, డాక్టర్ పి.లలితాకుమారి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - యంత్రాంగం

ఆనందపురం : ఆనందపురం సబ్ స్టేషన్ 11 కెవి మండల హెడ్ క్వార్టర్ నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పలు గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఎఇ మండల అప్పలనాయుడు తెలిపారు. వేములవలస, ఆనందపురం, ఎస్‌సి, బిసి కాలనీ, బిపి.కల్లాలు రోడ్డు, సత్య కల్యాణి అపార్ట్‌మెంట్స్ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, గృహ, వ్యవసాయ, పారిశ్రామిక వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

మధురవాడ : పిఎం.పాలెం సెక్షన్‌లో వైఎస్ఆర్ స్టేడియం 11 కెవి రెవెన్యూ లే-అవుట్ ఫీడర్, 11 కెవి సబ్‌స్టేషన్, బక్కన్నపాలెం ఫీడర్‌పై మరమ్మతుల నిమిత్తం శుక్రవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఇఇ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. అశోక్‌నగర్, ఆర్‌హెచ్.కాలనీ, ఫిష్ మార్కెట్ ఏరియా, లుంబిని పార్క్ ఏరియా, రెవెన్యూ లే-అవుట్ ఏరియా, వుడా కాలనీ, రామరాజు లే-అవుట్, బింద్రానగర్, రిజిస్టర్ ఆఫీసు ప్రాంతం, శివాలయం వీధి తదితర ప్రాంతాలకు ఉదయం 9 మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

డైట్ ప్రిన్సిపల్‌గా సుధాకర్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్ ప్రిన్సిపల్‌గా సీనియర్ అధ్యాపకులైన ఎల్.సుధాకర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ స్థానంలో ఉన్న ఎం.జ్యోతికుమారి గత నెల 30న ఉద్యోగ విరమణ చేసిన విషయం విదితమే. ప్రిన్సిపల్‌గా బాధ్యతలు చేపట్టిన సుధాకర్ మాట్లాడుతూ, అధ్యాపకులు, సిబ్బంది సహకారంతో డైట్‌ను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు.

డైట్ ప్రిన్సిపల్‌గా బాధ్యతలు చేపడుతున్న సుధాకర్

తాగునీరు వృథా

పట్టించుకోని అధికారులు

పైప్‌లైన్ పగలడంతో వృథాగా పోతున్న నీరు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం పంచాయతీ పరిధిలో బిసి.కాలనీ సమీపంలో సిపిడబ్ల్యు పైప్‌లైన్ పగలి నీరు వృథాగా పోతోంది. నెల రోజులుగా నీరు వృథాగా పోతున్నట్లు అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడంలేదని స్థానికులు చెబుతున్నారు. బోని వాటర్ వర్క్ నుంచి వివిధ గ్రామాలకు పైప్‌లైన్లను అడుగున్నర ఐరన్ పైపులతో ఏర్పాటుచేశారు. ఆనందపురం గ్రామపంచాయతీ పరిధిలో బిసి.కాలనీ కొండపైన ఉన్న మంచినీటి ట్యాంకు పైపును అనుసంధానం చేశారు. ఈ పైపు బిసి కాలనీ సమీపంలో రహదారి పక్కన పగిలిపోవడంతో నీరు ఉవ్వెత్తున లేస్తుంది. ఈ నీరు పైకి చిమ్మకుండా స్థానికులు రాళ్లను అడ్డుపెడుతున్నారు. నీరు చిమ్ముతూ రహదారి మొత్తం నీటితో నిండిపోతోంది. ఈ రహదారిలో అనేకమంది ప్రయాణిస్తుంటారు. రహదారిపై నీరు ప్రవహించడంతో బురదమయమవుతోంది. ఈ విషయమై గ్రామపంచాయతీ కార్యదర్శి రఘునాథ్ బాబును వివరణ కోరగా సిపిడబ్ల్యు పరిధిలోని ఈ పైపులైన్ పగిలిపోవడంపై ఫిర్యాదు చేశామని తెలిపారు. వేసవికాలం మంచినీటికి ఇబ్బందులు పడుతున్న సమయంలో వృథా ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సిపిడబ్ల్యు అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు

జూ పార్కును సందర్శించిన ఎంపీ శ్రీభరత్

ప్రజాశక్తి- ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలను విశాఖపట్నం ఎంపీ ఎం.శ్రీభరత్ గురువారం సందర్శించారు. జూ క్యూరేటర్ మంగమ్మ, అటవీ శాఖ అధికారి మహ్మద్ దివాన్ మైదిన్ ఆయనను సాదరంగా ఆహ్వానించారు. జూలో అభివృద్ధి పనులు, జంతు సేకరణ, జంతువుల ఆరోగ్య సంరక్షణ విషయాలను అడిగి తెలుసుకున్నారు. జూ అధికారులతో కలిసి జూ పరిసరాల్లో తిరిగారు. ఈ సందర్భంగా యానిమల్ కీపర్స్‌తోను, సందర్శకులతోనూ సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. జంతు దత్తత కార్యక్రమాన్ని ప్రశంసిస్తూ ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టాలని జూ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో జూ పార్కును ప్రపంచ స్థాయిలో అభివృద్ధి చేయడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.

జూ పార్కులో సౌకర్యాలను పరిశీలిస్తున్న ఎంపీ శ్రీభరత్

ట్రాన్స్ జెండర్లను ప్రోత్సహించాలి

ట్రాన్స్ జెండర్లకు కుట్టుశిక్షణ ప్రారంభంలో గంటా రవితేజ, మొల్లి హేమలత

ప్రజాశక్తి-మధురవాడ : జివిఎంసి 5వ వార్డు పరిధి మారికవలసలో నీ తోడు సొసైటీ ఆధ్వర్యాన ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ కోసం స్థిరమైన జీవనోపాధి కేంద్రాన్ని గురువారం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కుమారుడు గంటా రవితేజ, వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత ప్రారంభించారు. ఈ సందర్భంగా రవితేజ మాట్లాడుతూ, మధురవాడ పరిసర ప్రాంతాల్లోని ట్రాన్స్ జెండర్లు తమ కాళ్లపై నిలబడి, జీవన భృతి పొందడానికి నీ తోడు సొసైటీ ఆధ్వర్యాన కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించడం అభినందనీయమని రవితేజ పేర్కొన్నారు. కార్పొరేటర్ మొల్లి హేమలత మాట్లాడుతూ, ట్రాన్స్ జెండర్ల అభ్యున్నతికి నీ తోడు సొసైటీ చేస్తున్న సేవలు అభినందనీయం అన్నారు. ఈ కేంద్రానికి టాయిలెట్లు, అదనపు సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. 14 కుట్టు మిషన్లను వితరణగా అందించిన రోటరీ క్లబ్ అధ్యక్షుడు సామ్యూల్‌ను అభినందించారు. నీ తోడు సొసైటీ డైరెక్టర్ డాక్టర్ అమిత పోలిమెట్ల మాట్లాడుతూ, సమాజంలో వివక్షతను ఎదుర్కొంటున్న ట్రాన్స్ జెండర్లు జనజీవన స్రవంతిలో కలవడానికి 'నీ తోడు' సంస్థ కృషి చేస్తుందన్నారు. ట్రాన్స్ జెండర్లకు ప్రభుత్వం ఉచిత ఇల్లు, రేషన్ కార్డు, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జీవన్‌బాబు, జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి, రోటరీ క్లబ్ ప్రతినిధి పి.సామ్యూల్ బెన్ విక్టర్, చంద్రంపాలెం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గొట్టేటి రవి, స్థానిక నాయకులు ఈగల రవి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బాక్సింగ్ పోటీల్లో గోపాల్ ప్రతిభ

ప్రజాశక్తి-మధురవాడ : బాక్సింగ్ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన తెలంగాణాలో గత నెల 28వ తేదీ వరకు నిర్వహించిన 7వ జాతీయ స్థాయి బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయ ఉద్యోగి దువ్వి గోపాల్ బంగారు పతకం సాధించారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌లో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తు తనలోని క్రీడా ప్రతిభకు మెరుగులు దిద్దుకున్న డి.గోపాల్ బాక్సింగ్ పోటీలలో 80-86 కిలోల విభాగంలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి బంగారు పతకం అందుకున్నారు. గత 20 సంవత్సరాలుగా విశాఖ బాక్సింగ్ తరపున పలు జిల్లా, రాష్ట్ర స్థాయి పతకాలు సాధించాడు. ఉద్యోగి ప్రతిభను గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.వేదవతి, రసాయన శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ ఎన్‌విఎస్.వేణుగోపాల్ అభినందించారు.

గోపాల్‌ను అభినందిస్తున్న గీతం ప్రతినిధులు

భీమిలి జెడ్‌సిగా అయ్యప్పనాయుడు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ జోనల్ కమిషనర్‌గా తూర్పు గోదావరి జిల్లా రామచంద్రాపురం పురపాలక సంఘం కమిషనర్ ఒ.విమ్మ.అయ్యప్పనాయుడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. గత కొంత కాలంగా ఇక్కడ జోనల్ కమిషనర్‌గా పనిచేసిన పిల్లి ప్రేమప్రసన్న వాణిని డైరెక్టరేట్‌లో రిపోర్ట్ చేయాల్సిందిగా సంబంధిత ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న టైలర్లు

ఉగ్ర వాద దాడిని ఖండిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ

ప్రజాశక్తి -తగరపువలస : పెహల్‌గాంలో ఉగ్రదాడిని ఖండిస్తూ, ఆ మృతులకు నివాళులు అర్పిస్తూ తగరపువలస జంక్షన్‌లో గురువారం సాయంత్రం టైలర్లు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఎల్లమాంబ సంక్షేమ సంఘం ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు పెంటపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి చింతల సురేష్, జోగ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు

బిసి, ఒబిసి సర్టిఫికెట్ల జారీలో జాప్యంపై వినతి

ప్రజాశక్తి- ములగాడ : తూర్పు కాపులకు బిసి, ఒబిసి సర్టిఫికెట్లు జారీలో జాప్యం జరుగుతుందని, దాన్ని నివారించాలని కోరుతూ ములగాడ తహశీల్దార్‌కు విశాఖ జిల్లా కాపు, తెలగ, బలిజ సంక్షేమ సంఘం అధ్యక్షులు పెద్దిరెడ్డి నానాజీ వినతి పత్రం అందించారు. ఎన్నో సంవత్సరాల నుంచి విశాఖపట్నంలో స్థిరపడిన తూర్పు కాపులకు బిసి, ఒబిసి కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరులో ఎటువంటి ఆటంకాలు కలిగించకుండా నిర్దిష్ట సమయంలో జారీ అయ్యేలా కింద స్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేయాలని కోరారు. అచ్యుతాపురం, సబ్బవరం, చోడవరం తదితర మండలాల నుంచి వచ్చి విశాఖలో ఎన్నో ఏళ్లుగా స్థిరపడిన వారికి తూర్పు కాపు సర్టిఫికెట్లు మంజూరులో సిబ్బంది ఇబ్బందులకు గురి చేస్తున్నారని, పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని కోరారు.

ములగాడ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పెద్దిరెడ్డి నానాజీ

మేయర్‌కు సత్కారంలో పాల్గొన్న బెహరా భాస్కరరావు తదితరులు

మేయర్‌కు సత్కారం

ప్రజాశక్తి-గోపాలపట్నం : ఇటీవల జివిఎంసి మేయర్‌గా ఎన్నికైన పీలా శ్రీనివాసరావును జనసేన నాయకుడు బెహరా భాస్కరరావు కలిసి శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. నగర అభివృద్ధికి కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గేదెల మురళీకృష్ణ, గునిశెట్టి శ్రీనివాసరావు, కంపర కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా మేడే

గాజువాకలో మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

విశాఖ జిల్లా వ్యాప్తంగా మేడే వేడుకలను కార్మికులు గురువారం ఉత్సాహంగా జరుపుకున్నారు. వాడవాడలా ఎర్రజెండాలను ఎగురవేసి నినదించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

మేడే స్ఫూర్తితో స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుందాం : సిహెచ్.నర్సింగరావు

ఉక్కునగరం : మే డే స్ఫూర్తితో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను రక్షించుకోడానికి పోరాటాన్ని మరింత ఉధృతం చేద్దామని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన ప్లాంట్ ప్రధాన పరిపాలనా భవనం ఎదుట కార్యకర్తలు మేడే కవాతు నిర్వహించారు. మేడే పతాకాన్ని సిహెచ్.నర్సింగరావు ఆవిష్కరించారు. అనంతరం మేడే సభలో సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ, పెట్టుబడిదారి ఆర్థిక విధానాల వల్ల ప్రపంచ ఆర్థిక సంక్షోభం తీవ్రమవుతోందన్నారు. దీని ఫలితంగానే అనేక పరిశ్రమలు మూతబడుతున్నాయని తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పని ప్రదేశాలలో కార్మికులను కట్టు బానిసలుగా చేయడానికి కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా అమలులోకి తీసుకోస్తోందని వివరించారు. దీనికి వ్యతిరేకంగా ఈ నెల 20న జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు జె.అయోధ్యరామ్, యు.రామస్వామి, ఎన్.రామారావు, కెఎం.శ్రీనివాస్, పి.శ్రీనివాస రాజు పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి కళాకారులు విప్లవ గీతాలను ఆలపించారు.

స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన బిసి గేటు వద్ద జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో నాయకులు నమ్మి రమణ, జి.శ్రీనివాసరావు, యు.సోమేష్, పి.మసేను. సింహచలం పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేటు వద్ద జెండాను ఎఐటియుసి నాయకులు డి.ఆదినారాయణ ఎగురవేశారు. కెఎస్ఎన్.రావు, తాండ్ర కనకరాజు, డొక్కా నర్సింగరావు, కడిమి రాజాబాబు, పి పెద్దిరాజు పాల్గొన్నారు.

జివిఎంసి 86, 87, 88 వార్డులలో శ్రీ రామ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యాన మేడే నిర్వహించారు. గాజువాక మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య, మాడిస అప్పలరాజు పాల్గొన్నారు.

గాజువాక : పాత గాజువాక జంక్షన్‌లో మేడే జెండాను సిహెచ్.నర్సింగరావు ఎగురవేశారు. ముందుగా పాత గాజువాక నుంచి సినిమా హాల్ జంక్షన్ వరకు, తిరిగి పాత గాజువాక జంక్షన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులకు టిడిపి, జనసేన, బిజెపి ద్రోహం చేస్తున్నాయని విమర్శించారు. 3000 మంది కార్మికులను తొలగిస్తున్నప్పటికీ స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు స్పందించకపోవడం అన్యాయం అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు డి.రమణ, ఎం.జగ్గు నాయుడు, ఎం.రాంబాబు, ఎ.లోకేశ్వరరావు, ఎన్.రాజేంద్రప్రసాద్, పాల్గొన్నారు.

భెల్ గేటు వద్ద సిఐటియు నాయకులు పి.శివరాం జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో నాయకులు జిటిపి.ప్రకాష్, ఎస్.జగన్నాథరావు, సీతన్ననాయుడు, అప్పలనాయుడు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

బానాజీతోటలోని సిఐటియు కార్యాలయం వద్ద జెండాను ఎగురవేశారు. ఎన్.రాజేంద్రప్రసాద్, ఆర్.నాగేశ్వరరావు పాల్గొన్నారు .

గాజువాక 67వ వార్డులో సిఐటియు, వివిధ ప్రజా సంఘాలు నాయకులు జెండాలను ఎగురవేశారు. కార్యక్రమంలో కె.కిరీటం, కెపి.కుమార్, లక్ష్మణస్వామి పాల్గొన్నారు. కొత్త గాజువాక బస్ స్టాప్ వద్ద పండ్ల వ్యాపారులు, కళాశీల ఆధ్వర్యాన జెండాను గొలుగు రామిరెడ్డి ఎగురవేశారు. కార్యక్రమంలో చిన్నరెడ్డి శ్రీను, గంగాధర పాల్గొన్నారు. 67వ వార్డులో లోకేష్, బంగారు నాయుడు, తుంపాల శ్రీరామమూర్తి, మధు జెండాలను ఎగురవేశారు.

కొమ్మాది : సాయిరాం కాలనీ, గణేష్‌నగర్ స్వతంత్ర నగర్, నగరంపాలెంలో భవన నిర్మాణ కార్మికులు బైక్ ర్యాలీ నిర్వహించారు. కొమ్మాది కూడలిలో మజ్జిగ వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, సిఐటియు నాయకులు రాజకుమార్, అప్పలరాజు, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆనందపురం : ఆనందపురం కూడలిలో ఐద్వా, మిడ్డేమీల్స్, ముఠా కార్మికులు మేడే జెండాను ఎగరవేశారు. కె.నాగరాణి, వీరన్న పాల్గొన్నారు. వేములవలస పూల మార్కెట్లో జెండాను వ్యాపారవేత్త పతివాడ గోపాలరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో అప్పలరాజు, లక్ష్మి, నాగరాణి పాల్గొన్నారు. ఆనందపురం బ్రిడ్జి కింద జెండాను కె.అప్పలరాము ఎగురవేశారు. బొద్దపాలెంలో జెండాను ప్రముఖ ఆయుర్వేద నిపుణులు వీరన్న ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో శివశంకర్, అప్పలరాము, శరత్‌చంద్ర, అప్పలనాయుడు, అప్పారావు పాల్గొన్నారు.

మధురవాడ : జివిఎంసి 5, 6 వార్డుల పరిధిలోని 32 కాలనీలో స్థానిక నాయకులు, కొమ్మాదిలో కెవి.అప్పారావు, సియ్యాద్రి పైడితల్లి, సాయిరాం కాలనీలో ఎ.లక్ష్మణరావు జెండాలను ఎగురవేశారు. పరదేశిపాలెం, మారికవలస ప్రాంతాలలో ఎ.గురుమూర్తిరెడ్డి, జివిఎంసి 5వ వార్డు కార్యాలయం వద్ద వార్డు ఇన్‌స్పెక్టర్ కాకర శ్రీను, త్రిశక్తి భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు నాగోతి అప్పారావు, జెండాను ఎగురవేశారు. జోనల్ కార్యాలయం వద్ద బి నరసింగరావు పాల్గొన్నారు. కొమ్మాది సిఐటియు కార్యాలయంలో పి.రాజుకుమార్ జెండా ఎగురవేశారు. పాపారావు, పూర్ణ, ప్రమీల పాల్గొన్నారు.

మధురవాడలోని సిపిఐ కార్యాలయం వద్ద ఆ పార్టీ నాయకులు వి.సత్యనారాయణ, హైస్కూల్ వద్ద ముఠా నాయకులు ఎం బంగారయ్య, నగరంపాలెంలో వి.అప్పలకొండ, మల్లయ్యపాలెంలో కొల్లి రావులమ్మ జెండాలను ఎగరవేశారు.

పెందుర్తిలో....

పెందుర్తి: మేడే సందర్భంగా పెందుర్తి రైతు బజార్ సిఐటియు ఆఫీస్ నుంచి సుజాతనగర్ వరకు సిఐటియు పెందుర్తి జోన్ కమిటీ ఆధ్వర్యాన ప్రదర్శన నిర్వహించారు. ముందుగా సిఐటియు సీనియర్ నాయకులు కె.అప్పలనాయుడు జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.జగన్, పద్మ, జి.శంకరరావు, ఎస్‌వి.అప్పారావు, భాష, మౌలాలి, బి.రమణి పాల్గొన్నారు.

తగరపువలసలో సిఐటియు ర్యాలీ

తగరపువలస : జివిఎంసి 3, 4 వార్డుల పరిధిలో ఆటో, ముఠా, రాజీవ్ గృహకల్ప గృహ సముదాయం, చిట్టివలస సిఐటియు కార్యాలయం, జంక్షన్, ప్రైవేట్ మార్కెట్, శివాలయం, వై.జంక్షన్ తదితర ప్రాంతాల్లో ఆటో, ముఠా, మినీ వ్యాన్స్, ట్రాన్స్ పోర్ట్ స్టాండ్‌ల వద్ద జెండాలు ఎగుర వేశారు. కార్యక్రమంలో నాయకులు ఆర్ఎస్ఎన్.మూర్తి, రవ్వ నరసింగరావు, ఎస్.అప్పలనాయుడు, పల్లా పోతురాజు, పంపాన సూర్య నారాయణ తది తరులు పాల్గొన్నారు.

చిట్టివలస లేబర్ యూనియన్ ఆధ్వర్యాన యూనియన్ కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కొండపు ఈశ్వరరావు, రాం పైడి పాల్గొన్నారు.

మాధవధార : సిపిఎం, సిఐటియు ఆధ్వర్యాన మాధవధార మాధవ యువజన సమాజం ఆవరణలో, 48 ఎ బస్టాపు వద్ద జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సనపల ఆంజనేయులు, సనపల రామ్‌గోపాల్‌రావు, కూన వెంకట్రావు, కె.సుధాకరరావు, పప్పల రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ములగాడ :కోరమండల్ గేట్ ముందు విశాఖపట్నం కాంట్రాక్టు లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి పతాకావిష్కరణ చేశారు. అనంతరం మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుడాల రాంబాబు, గండి అప్పారావు, బి.హరినాథ్, మధుసూదన్ రావు, సిహెచ్ మాధవరావు పాల్గొన్నారు. కాకలోవ, సింధియా జంక్షన్, న్యూ కాలనీ, మల్కాపురం, శ్రీహరిపురంలో పతాకాలను ఆవిష్కరించారు.

సిఐటియు మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యాన కాకర్లోవ నుంచి క్రాంతినగర్, త్రినాధపురం, జనతా కాలనీ మీదగా నెహ్రు నగర్ లేబర్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. షిప్ యార్డ్ నుంచి న్యూ కాలనీ మల్కాపురం మీదుగా గొల్లలపాలెం వరకు మరో ర్యాలీ సాగింది. ములగాడ హౌసింగ్ కాలనీ నుంచి నెహ్రూనగర్ మీదుగా శ్రీహరిపురం వాకింగ్ పార్కు వరకు ర్యాలీ కొనసాగింది. మొత్తం 40 చోట్ల సిఐటియు పతాకాలను ఎగురవేశారు. ఆయా కార్యక్రమంలో కె.పెంటారావు, ఆర్.నాగేశ్వరరావు, డి.గోపాల్, టి.అప్పారావు, ఎస్ ప్రసాద్, వి.బాబూరావు ఆర్.లక్ష్మణమూర్తి ఎర్రజెండాలను ఎగురవేశారు.

జివిఎంసి 58, 59 వార్డుల్లోని సిఐటియు కార్యాలయాల వద్ద యూనియన్ జిల్లా నాయకులు ఎం.జగ్గునాయుడు జెండాను ఎగురవేశారు. అనంతరం జరిగిన సభలో జగ్గునాయుడు మాట్లాడుతూ, లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, రూ.26 వేలు వేతనం ఇవ్వాలని, స్టీల్ ప్లాంట్ అమ్మకం ఆపాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి, కె.పెంటారావు, ఆర్.విమల, పి.పైడిరాజు, జి.నరేష్, గంగాధర్ పాల్గొన్నారు.

మల్కాపురం ప్రాంతంలో జెండాను ఎగురవేస్తున్న జగ్గునాయుడు

గోపాలపట్నం : సిఐటియు ఆధ్వర్యాన గోపాలపట్నం సిఐటియు కార్యాలయం వద్ద పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం గోపాలపట్నం నూకాలమ్మ అమ్మవారి గుడి నుంచి గోపాలపట్నం పెట్రోల్ బంక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బలివాడ వెంకటరావు మాట్లాడారు. మేడే దినోత్సవాన్ని పురస్కరించుకొని సింహపురికాలనీకి చెందిన 50 మంది కార్మికులు సిఐటియులో చేరారు. కార్యక్రమంలో ఉరికూటి రాజు, పి.అనసూయ, జీవా, వాసునాయుడు పాల్గొన్నారు.

యుటిఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యాన ఎన్ఎడి సమీపంలోని కార్యాలయంలో జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో దాసరి నాగేశ్వరరావు, ఎన్.ప్రభాకర్, టిఆర్.అంబేద్కర్, టి. అప్పారావు పాల్గొన్నారు.

ఆరిలోవ : ఇందిరా గాంధీ జూలాజికల్ పార్క్ వద్ద కార్మికులతో కలిసి సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో పైడిరాజు, నరేష్‌రాజు, నరసింగరావు, దిలీప్, అప్పలరెడ్డి పాల్గొన్నారు.

ఆరిలోవ సిఐటియు కార్యాలయం వద్ద ఆర్‌కెఎస్‌వి.కుమార్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పి.శంకర్, నాగరాజు, బి.సూర్యమణి, ఎస్.రంగమ్మ, రత్నం, పాల్గొన్నారు.

సీతమ్మధార : అక్కయ్యపాలెంలో 25 చోట్ల సిఐటియు సీనియర్ నాయకులు స్వతంత్ర కుమార్, జోన్ నాయకులు రాజు, జి.అప్పలరాజు, ఎన్.ప్రకాష్, కె.స్వతంత్ర కుమార్, పి.గౌరీష్ జెండాలను ఎగురవేశారు.

వేపగుంట : వేపగుంటలోని జివిఎంసి జోనల్ కార్యాలయం వద్ద జెండాను జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి, సిపిఎం నాయకులు బి.రమణి ఎగురవేశారు. కార్యక్రమంలో సోములమ్మ పాల్గొన్నారు.

పద్మనాభం : పద్మనాభం సిపిఎం కార్యాలయం, పద్మనాభం జంక్షన్‌లో, పద్మనాభ క్వారీ, వెంగమాంబ కృష్ణాపురం, రేవిడి గ్రామాల్లో లారీల యూనియన్ ఆధ్వర్యాన మేడే జెండాలను ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవ్వ నర్సింగరావు, అప్పారావు, ఎస్.రాము, కృష్ణ పాల్గొన్నారు.

లీగల్ : విశాఖ జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవ ప్రాధికార సంస్థ సమావేశ మందిరంలో మేడే వేడుకలను నిర్వహించారు. విశాఖ జిల్లా న్యాయ సేవ ప్రాధికార సంస్థ కార్యదర్శి ఎం సన్యాసినాయుడు మాట్లాడారు. సమాజంలో కార్మికుల హక్కుల పరిరక్షణ బాధ్యత అందరిదీ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎం.రామారావు, జోనల్ కమిషనర్ ఎం గోవిందు, జివల్లభనాయుడు పాల్గొన్నారు.

ప్రజాశక్తి కార్యాలయంలో..

గాజువాక : ఆటోనగర్‌లోని ప్రజాశక్తి విశాఖ ఎడిషన్ కార్యాలయంలో మేడే వేడుకలు ఘనంగా జరిగాయి. ఎర్రజెండాను సీనియర్ ఉద్యోగి జి.సంతోష్ కుమార్ ఎగురవేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ, ప్రజాశక్తి ఎడిటోరియల్ బోర్డు గౌరవ సలహాదారు ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ మేడే ప్రాధాన్యతను తెలిపారు. మోడీ ప్రభుత్వ హయాంలో కార్మిక హక్కులపై తీవ్ర దాడి జరుగుతోందన్నారు. ప్రజల్లో కొనుగోలు శక్తి తగ్గిపోతోందని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు, సమన్వయ కమిటీ సభ్యులు రాజేష్ రెడ్డి, వై.సత్యనారాయణ, టి.అప్పలరాజు పాల్గొన్నారు. ఆర్‌కె.నాయుడు అధ్యక్షత వహించారు.

ప్రజాశక్తి కార్యాలయంలో మాట్లాడుతున్న ఎంవిఎస్.శర్మ

ఉక్కునగరంలో స్టీల్‌ప్లాంట్ కార్మికుల కవాతు

పింఛన్ల పంపిణీ సక్రమంగా చేపట్టాలి

జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి- అనకాపల్లి : ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు లబ్ధిదారులకు సక్రమంగా, సకాలంలో పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని, మొత్తం పింఛన్లు ఒక్కరోజులోనే అందజేయాలని జిల్లా కలెక్టరు విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. గురువారం కోడూరు పంచాయతీ ఎస్‌సి. కాలనీలో లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ముందుగా ముఖ్యమంత్రి సందేశం లబ్ధిదారులకు వినిపించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో జిల్లా కలెక్టరు మాట్లాడుతూ ప్రతినెలా పింఛను డబ్బులు సక్రమంగా అందుతున్నాయో లేదో సరిచూసుకోవాలన్నారు. లబ్ధిదారులు పెన్షన్లు పంపిణీ ప్రక్రియపై సంతోషం వ్యక్తం చేయడంపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేసారు.కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ కె.శచీదేవి, ఎంపిడిఒ నర్సింగరావు, గ్రామ సర్పంచ్ సేనాపతి లక్ష్మీశ్రీనివాస్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



చోడవరంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజు

ఎనిమిది మందికి కొత్త పింఛన్లు

బుచ్చయ్యపేట : గతనెలలో మృతి చెందిన పింఛను లబ్ధిదారుల భార్యలకు ఈనెలలో 8కొత్త పింఛన్లు మంజూరయ్యాయని ఎంపిడిఒ విజయలక్ష్మి తెలిపారు..గురువారం బుచ్చయ్య పేట, వడ్డాది, చిన అప్పన్నపాలెంలలో పింఛన్ల పంపిణీ పరిశీలించారు. మండలంలో 10474 మంది పెన్షన్లకుగాను, తొలిరోజే 90 శాతం పంపిణీ పూర్తయిందన్నారు. వడ్డాదిలో మూడు కొత్త పింఛన్లు మంజూరుకాగా, టిడిపి పట్టణ అధ్యక్షుడు దొండా నరేష్ పంపిణీ చేశారు

చోడవరం : చోడవరంలో ఎడ్ల వీధిలో సామాజిక పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే కెఎస్ఎస్ఎన్.రాజు పాల్గొని, పలువురికి పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో గునూరు మల్లునాయుడు , గునురూ పెదబాబు , దేవరపల్లి వెంకట అప్పారావు సకురు కోటేశ్వరరావు, పప్పు శ్రీను, గునూరు పెద అచ్చిబాబు, ఎలుక మల్లిబాబు, గొరిలి సుధాకర్ పాల్గొన్నారు.

80 మందికి ఉచిత కంటి పరీక్షలు

కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ అరుణ

ప్రజాశక్తి-.అనకాపల్లి : మండలంలోని మూలపేట గ్రామంలో తాపీ మేస్త్రి సంఘం, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా కమిషనర్ ఆఫ్ లేబర్ వసంతరావు శిబిరాన్ని ప్రారంభించారు. 80 మందికి డాక్టర్ అరుణ కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ ప్రతినిధులు పూసర్ల రాజా, కార్మిక సంఘం అధ్యక్షులు చీర అప్పలరాజు, కార్యదర్శి మారేడి పూడి సత్యనారాయణ, నాయకులు గుమ్మాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

మజ్జిగ పంపిణీ చేస్తున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి -అనకాపల్లి : మేడే సందర్భంగా బైపాస్‌లో ముఠా కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని గురువారం స్థానిక ట్రాఫిక్ ఎస్ఐ డి.శేఖర్ ప్రారంభించారు. ముందుగా కార్మిక జెండా ఆవిష్కరణ చేసారు. అనంతరం బిస్కెట్లు, మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు గంటా శ్రీరామ్, న్యాయ వాది సింహాచారి, మందా రాము, కశిరెడ్డి నాగేశ్వరరావు, మైసర్ల భవాని పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక చిన్న బజారు డచ్ రోడ్డు వద్ద కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన మజ్జిగ చలివేంద్రాన్ని స్థానిక ఎస్ఐ జి.హరీష్ గురువారం ప్రారంభించారు. వేసవి కాలమంతా చలివేంద్రాన్ని కొనసాగిస్తామని ఫౌండేషన్ చైర్మన్ శ్రీరామ చంద్రమూర్తి తెలిపారు. ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వెంకటరావు కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - ఆరిలోవ : సింహాచలం ఆలయంలో గోడ కూలిన ఘటనలో అడవివరం ప్రాంతానికి చెందిన స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి ఎడ్ల వెంకటరావు మృతిచెందడంతో ఆ కుటుంబాన్ని అన్నమయ్య జానపద కళా క్షేత్రం విశాఖ జిల్లా అధ్యక్షులు వై.అప్పారావు, రట్టి భగవాన్‌దాసు గురువారం పరమర్శించారు.

ఘనంగా హిట్ -3 విజయోత్సవం

ప్రజాశక్తి -అనకాపల్లి : అనకాపల్లి శిరిడి సాయి, పర్తి సాయి థియేటర్లో హీరో నాని నటించిన హిట్ - 3 చిత్రం విడుదలై, ఘన విజయం సాధించిన సందర్భంలో అనకాపల్లి జిల్లా నాని ఫ్యాన్స్ అధ్యక్షులు గౌరీపట్నపు సురేష్ ఆధ్వర్యంలో అభిమానల సమక్షంలో విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేశారు. అనంతరం చిత్రాన్ని వీక్షించిన ప్రేక్షకులకు మజ్జిగ ప్యాకెట్లు, థియేటర్ యాజమాన్యం ఫ్రూట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాని ఫ్యాన్స్ అధ్యక్షులు సురేష్ మాట్లాడుతూ 2025లో హీరో నాని నిర్మాతగా కొత్త నటీనటులతో మొదటగా నిర్మించిన కోర్టు చిత్రం ఘన విజయం సాధించిందన్నారు. ఇప్పుడు నాని హీరోగా డైరెక్టర్ డాక్టర్ శైలస్ కొలను తెరకెక్కించిన హిట్ - 3 చిత్రం మంచి విజయం సాధించి ప్రేక్షకులు ఆదరణ పొందుతోదన్నారు. మరొక చిత్రం పేరడైజ్ ద్వారా త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్. భానుచందర్ (అఖి), ఉప్పల సాయి, నాని అభిమానులు మణికంఠ, అరుణ కుమార్, నాని, నవీన్, రాజా, ప్రసాద్, ఉమ, పురుషోత్తం, చందు, నాయుడు పాల్గొన్నారు.

కేకు కట్ చేస్తున్న హీరో నాని అభిమానులు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

సాయం అందజేస్తున్న కూటమి నేతలు

ప్రజాశక్తి సబ్బవరం.: మండలంలోని బాటజంగాలపాలెం గ్రామానికి చెందిన కోరుకొండ నాయుడు ఇటీవల గుండెపోటుతో మరణించాడు. కోరుకొండ నాయుడు కుటుంబ సభ్యులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకొని గ్రామ సర్పంచ్ పడాల వెంకటరమణ, కూటమి నాయకులు ఆధ్వర్యంలో పెందుర్తి టిడిపి ఇన్‌ఛార్జి గండి బాబ్జీ, పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షులు సహాయ సహకారంతో కూటమి నాయకులు రూ.56 వేలు సాయాన్ని మృతుని కుటుంబ సభ్యులకు భరణికాన బాబురావు, కూటమి నాయకులు చేతుల మీదుగా అందజేశారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాధిత కుటుంబానికి కూటమి పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కె.రామకృష్ణ రాజు, వనం సత్యనారాయణ, తమరాన బంగారు నాయుడు, అంగటి నానాజీ, పోతల శ్రీనివాసరావు టిడిపి గ్రామ కమిటీ సభ్యులు మొరకాడ వీర వెంకట అప్పలరాజు, వనం సన్యాసిరావు, కాపుశెట్టి నరసింహ, గొర్లి నూకరాజు, కాపుశెట్టి వెంకట్,పందిరిపల్లి రాము, తాడి రమణ, వార్డు సభ్యులు బలిరెడ్డి నూకరాజు, నాగులపల్లి కోటిలింగం, పడాల అప్పలరాజు,గొట్టాపు బలరాం నాయుడు పాల్గొన్నారు.

వాడ చీపురుపల్లి టిడిపి గ్రామ కమిటీ ఎన్నికలు

ప్రజాశక్తి - పరవాడ : మండలంలోని వాడచీపురుపల్లి పంచాయతీలో మాజీ ఎంపిపి మాసవరపు అప్పలనాయుడు, మండల టిడిపి అధ్యక్షులు వియ్యపు చిన్న ఆధ్వర్యంలో గురువారం టిడిపి గ్రామ కమిటీ ఎన్నికలు జరిగాయి అధ్యక్షులుగా వియ్యపు ముత్యాలు నాయుడు, ఉపాధ్యక్షులు చీకటి ఆది నారాయణ, ప్రధాన కార్యదర్శిగా కొమ్మోజు రాజు, కార్యదర్శిగా పేదపూడి పద్మలను ఎన్నుకున్నారు. కొత్త కమిటీని మండల టిడిపి అధ్యక్షులు వియ్యపు చిన్న అభినందించి, సత్కరించారు. కార్యక్రమం లో కూండ్రపు శ్రీనివాసరావు, లాలం ఈశ్వరరావు, గోరుసు అప్పలరాజు, నాయుడు, పార్టీ కార్యకర్తలు, నాయుకులు పాల్గొన్నారు.

వాడ చీపురుపల్లి టిడిపి గ్రామ కమిటీ

పాన్ షాప్ దగ్ధం

నిఘా వైఫల్యం వల్లే వాంఛిత అగ్ని ప్రమాదాలు

ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఐద్వా నేత మాణిక్యం, తదితరులు

ప్రజాశక్తి - పరవాడ: మండల కేంద్రం పరవాడ సంతబయలు వద్ద గురువారం తెల్లవారుజామున అప్పలరాజు అనే వ్యక్తికి చెందిన బాబు పాన్ షాప్ అగ్నికి ఆహుతైంది. పరవాడ గ్రామంలో మార్కెట్ పరిసర ప్రాంతాల్లో షాపులు తరచూ అగ్ని ప్రమాదానికి గురికావడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా జరిగిన అగ్ని ప్రమాదం కూడా ఎవరో కావాలని చేస్తున్నారని స్థానికులు అంటున్నారు. వాంచితంగా జరుగుతున్న అగ్నిప్రమాదాలపై వ్యాపారులు వాపోతున్నారు.

సంఘటనాస్థలిని ఐద్వా అనకాపల్లి జిల్లా అధ్యక్షురాలు పిట్ల మాణిక్యం ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ చుక్క రావునాయుడు, శ్రీను, పైడ్రాజు, అప్పారావు, సోములమ్మ, తదితరులు సందర్శించారు. ప్రమాద కారణాలపై ఆరా తీశారు. ఏడాది కాలంలో 13 దుకాణాలు ఇలాగే దగ్ధమై వ్యాపారులు నష్టపోతున్నా పోలీసులు తగు చర్యలు చేపట్టకపోవడంపై ఐద్వా నేత మాణిక్యం తీవ్ర ఆరోపణలు చేశారు. దీనిపై పోలీసుల గట్టినిఘా పెట్టాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. ప్రభుత్వపరంగా ఆయా ప్రాంతాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. ఇక్కడున్న విద్యుత్‌స్తంభాన్ని తాకితే షాక్ కొడుతోందని, అయినా సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడవం దారుణమన్నారు. ప్రమాదాలకు అడ్డాగా మారుతున్న పరవాడ గ్రామంలో పూర్తి నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయాలని మాణిక్యం కోరారు.

సేవారత్న అవార్డు గ్రహీతకు అభినందన

అవార్డును స్వీకరిస్తున్న ప్రసాద్

ప్రజాశక్తి- సబ్బవరం. : మండలంలోని వంగలి గ్రామానికి చెందిన రక్తదాత, తాసుబిల్లి ఫౌండేషన్ సభ్యులు పొట్నూరు ప్రసాద్‌కు సేవారత్న అవార్డు వరించింది. అంబేద్కర్ కోనసీమ జిల్లా పి గన్నవరంలో మమతా స్వచ్ఛంద సేవా సంస్థ పలువురు సమాజ సేవకులను గుర్తించి ఉద్యమకారుడు మాజీ ఎమ్మెల్యే నీతిపూడి గణపతిరావు పేరిట ఇస్తున్న నీతిపూడి సేవారత్న అవార్డును ప్రసాద్ స్వీకరించారు. గన్నవరంలో జరిగిన కార్యక్రమంలో అక్కడి ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ, రాజమండ్రి ఎపిఎస్‌పి కమాండెంట్ కొండా నరసింహారావు ఇతర ప్రముఖుల నుంచి అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు అవార్డు గ్రహీత ప్రసాద్‌ను అభినందించారు. నీతిపూడిసేవారత్న అవార్డుకు తనను ఎంపిక చేయడంతపై మమతా స్వచ్ఛంద సేవా సమితి అధ్యక్షులు కారుకొండ జాను, కమిటీ సభ్యులకు ప్రసాద్ ధన్యవాదాలు తెలిపారు. అవార్డు దక్కడంపై తాసుబెల్లి ఫౌండేషన్ చైర్మన్ శంకర్‌నాయుడు, ట్రస్టీ వెంకటలక్ష్మి, జెట్టి గణేష్‌లకు ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

జనసేన కిట్లు పంపిణీ

ప్రజాశక్తి- మునగపాక : స్థానిక జనసేన ర్యాలయంలో క్రియాశీలక సభ్యత్వాల కిట్లు మండల పార్టీ అధ్యక్షులు టెక్కలి పరశురాం గురువారం కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి, గ్రామ సమస్యలను తమ దృష్టికి తేవాలన్నారు.కార్యక్రమంలో మొల్లేటి ఆనంద్, వేగి కష్ణ, కాశి, రవి తదితరులు పాల్గొన్నారు.

గుండె ఆపరేషన్‌కు రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం చీడిగుమ్మల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్ గా పనిచేస్తున్న ఎస్ నవీన్ కుమార్ ఆర్మేళ్ల కుమారునికి గుండెలో రంధ్రం ఏర్పడడంతో చికిత్స నిమిత్తం రూ.లక్ష రూపాయల విరాళాన్ని ఏపీ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ అనకాపల్లి శాఖ, వివిధ ప్రోగ్రామ్స్ లో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్స్ అందజేశారు. కార్యక్రమంలో ఏపి రాష్ట్ర మెడికల్ లేబరేటరీ అసోసియేషన్ అసోసియేట్ ప్రెసిడెంట్ టి తిరుపతి బాబు, రాష్ట్ర సంఘ కోశాధికారి ఎండి దురాని, జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గీతా రాణి, మీసాల సూర్య శంకర్రావు, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కే శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-సబ్బవరం: మండలంలోని సబ్బవరం-1, 2 సెక్షన్ పరిధిలోని సబ్బవరం, అంతకాపల్లి సబ్ స్టేషన్లలో పిఎంఐ పనులు, ఇతర నిర్వహణ పనుల కారణంగా ఈనెల 2న శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని కశింకోట ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్స్ ఇఇ ఎస్.రామకృష్ణ ప్రకటనలో తెలిపారు. సబ్బవరం, అంతకపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలో సబ్బవరం, తవ్వవానిపాలెం, అమృతాపురం, గొల్లలపాలెం, పైడివాడ, ఆసకపల్లి, ఇరువాడ, గొట్టివాడ, అరిపాక అంతకపల్లి, గుల్లేపల్లి, మొగలిపురం, మల్లు నాయుడు పాలెం, అయ్యన్నపాలెం, బాగారమ్మపాలెం, నాయనమ్మ పాలెం, ఎల్లప్పి, వంగలి, గాలిభీమవరం, అడ్డూరు పంచాయతీ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ ఉండదన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - యలమంచిలి :మండలంలోని రేగుపాలెం గ్రామ పంచాయతీని జిల్లా పంచాయతీ అధికారి శిరీష గురువారం సందర్శించారు. గ్రామ సర్పంచ్ మహాలక్ష్మితో కలిసి గ్రామంలోని అభివృద్ధి కార్యక్రమాలు పరిశీలించారు. ఎస్ డబ్ల్యు పి.సి. కేంద్రం సందర్శించి పంచాయతీ కార్యదర్శి రవి, సిబ్బందికి సూచనలివ్వడం జరిగింది. పారిశుధ్య పనులు క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ కొండలరావు, ఈఓపిఆర్‌డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గవరల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి- అనకాపల్లి రూరల్ : ఏలూరు పట్టణం అశోక నగర్ గౌరీ కళ్యాణ మండపంలో గవరల ఆత్మీయ సమావేశంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర పాల్గొన్నారు.ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో గవరలను రాజకీయంగా గుర్తించిన వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు మరో రెండు పర్యాయాలు ముఖ్యమంత్రి కావాలన్నారు. కార్యక్రమంలో గవర సంఘం నాయకులు సూరిశెట్టి సత్యనారాయణ,బోడేటి సుబ్బారావు,ఆళ్ల తాతారావు,పేతకం శెట్టి వెంకటరావు,బోడేటి మోహన్,మల్ల శ్రీనివాసరావు,పీలా గోపాల్,ఆళ్ళ సోమునాయుడు,వేగి గంగాధర్,కాండ్రేగుల నాగ చిన్నారావు,పొలమారశెట్టి సన్యాసిరాజు,పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్‌గా కిషోర్

ప్రజాశక్తి- కె. కోటపాడు: కె.కోటపాడు నూతన సబ్ రిజిస్ట్రార్‌గా ఎం.కిషోర్ గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. స్థానిక సబ్ రిజిస్ట్రార్ఆర్. శకుంతల ఉద్యోగ విరమణ చేయడంతో ఆమె స్థానంలో కిషోర్ బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నం డిఐజి ఆఫీస్ నుండి ఇక్కడికి బదిలీపై వచ్చినట్లు కిషోర్ తెలిపారు

చోరీ సొత్తు రికవరీ

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని చిన్నయపాలెం వద్ద చిన ముషిడివాడకు చెందిన శ్రీనాథ్ జగన్నాథం మెడలో బంగారం గొలుసును చోరీ చేసిన కేసులో నిందితులను పట్టుకుని చోరీ సొత్తును రికవరీ చేసినట్లు పరవాడ డిఎస్‌పి విష్ణుస్వరూప్ తెలిపారు. జగన్నాథం పోలీసులకు ఫిర్యాదు మేరకు సిసి కెమెరాల ఫుటేజీ ఆధారంగా మూడు రోజుల్లో దొంగలను పట్టుకున్నట్లు తెలిపారు. పెందుర్తి ప్రాంతానికి చెందిన సయ్యద్ నిజాముద్దీన్ , గానుగుల నవీన్ కుమార్, పెరుమాల చంద్రశేఖర రావులను పట్టుకుని వారి నుంచి చోరీ సొత్తు రికవరీ చేసి బాధితులకు అప్పగించామన్నారు. కేసు చేధించిన పోలీసులను డిఎస్‌పి అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఐలు పి.సింహాచలం, టి.దివ్య,పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వేసవిలో దొంగతనాల నివారణకు ప్రత్యేక పోలీస్ టీంలు ఏర్పాటుచేశామన్నారు. పోలీసుల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కొనసాగుతున్న సిహెచ్‌ఒల నిరసన

పట్టణంలో భారీ ర్యాలీ, నెహ్రూ చౌక్‌లో మానవహారం

ప్రజాశక్తి- అనకాపల్లి : వైద్య ఆరోగ్యశాఖలో నేషనల్ హెల్త్ మిషన్, ఆయుష్మాన్ ఆరోగ్య మిషన్‌లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ (సిహెచ్‌ఒ)ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మూడు రోజులుగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా గురువారం అనకాపల్లి సిఐటియు కార్యాలయం నుంచి నెహ్రూ జంక్షన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి, అక్కడ మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ నిబంధన ప్రకారం ఆరు సంవత్సరాల సర్వీసు దాటిన ప్రతి ఒక్క సిహెచ్‌ఒను క్రమబద్ధీకరించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23% వేతన సవరణ చేయాలని, ప్రతి సంవత్సరం 5శాతం ఇంక్రిమెంట్, పని ఆధారిత ప్రోత్సాహకాలు, ఇపిఎఫ్‌ఒ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఎఫ్‌ఆర్‌ఎస్ నుండి సిహెచ్‌ఒలను మినహాయించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేపట్టారు. జిల్లాలోని 45 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న సిహెచ్‌ఓలు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. నిరసనలో సిహెచ్‌ఒలు జి భవాని, పి రేవతి, జి యమునా, కె అశ్విని, టి కళ్యాణి, బి.సుధాకర్, ఆర్.అప్పలనాయుడు, పి.రాజశేఖర్, సిహెచ్ స్వామి పాల్గొన్నారు

ర్యాలీ చేస్తున్న సిహెచ్‌ఒలు

మధురవాడ మార్కెట్‌ను అభివృద్ధి చేయరూ..

వసతులు కొరవడిన మధురవాడ రోజు వారీ మార్కెట్

ప్రజాశక్తి -మధురవాడ : ప్రభుత్వాలు, పాలకులు, అధికారులు మారినా మధురవాడ రోజువారీ మార్కెట్ దుస్థితి మాత్రం మారడం లేదు. జోన్ 2 పరిధిలోని 5, 6, 7 వార్డుల పరిధిలో ఉన్న వారికి ఇది రోజువారీ మార్కెట్. ఇక్కడికి నిత్యం వేలాది మంది వినియోగదారులు వస్తుంటారు.

ప్రజా ప్రతినిధులు హామీలు ఇవ్వడమే కానీ మధురవాడ రోజువారి మార్కెట్ దుస్థితి మారడం కనబడలేదు. 30 ఏళ్లుగా ఈ మార్కెట్ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా ఉంది. ఈ మార్కెట్‌లో నిత్యం వివిధ రకాల శాఖాహార, మాంసంహార వ్యాపారాలు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. సరైన వసతులు, రహదారులు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ మార్కెట్‌ను అభివృద్ధి చేస్తామని పాలకులు హామీ ఇస్తున్నారు తప్ప నెరవేర్చడం లేదు. ఇప్పటికైనా పాలకులు, సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని మధురవాడ రోజు వారీ మార్కెట్‌ను అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు.

టెన్త్ టాపర్‌కు అభినందన

ప్రజాశక్తి- మునగపాక: పదవ తరగతి పరీక్షలలో గణపర్తి జిల్లా పరిషత్ పాఠశాలలో 559 మార్కులు తెచ్చుకుని పాఠశాల టాపర్‌గా నిలిచిన విద్యార్థిని చదరం త్రిషను ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ గురువారం అభినందించారు. ఎమ్మెల్యే నివాసంలో స్వీట్లు తినిపించి, బహుమతిని ఇచ్చి అభినందించారు. తహశీల్దార్ ఆదిమహేశ్వరరావు, ఎస్ఐ ప్రసాదరావులు కూడా త్రిషను ప్రశంసించారు. కార్యక్రమంలో మండల జనసేన కార్యదర్శి కాళ్ళ.చంద్రమోహన్, విద్యార్థిని తండ్రి చదరం నూకఅప్పారావు, ఉపాధ్యాయుడు కర్రి. లక్ష్మి నారాయణ పాల్గొన్నారు.

సాల్వ్ ఫర్ టుమారో 2025 ప్రారంభం

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ: భారతదేశంలోనే అతిపెద్ద వినియోగదారుల ఎలక్ట్రానిక్ బ్రాండ్ శాంసంగ్ ఇండియా సాల్వ్‌ఫర్ టుమారో 2025 నాల్గో ఎడిషన్‌ను ఆదివారం విశాఖలో ప్రారంభించింది. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో సంస్థ ప్రతినిధి జేబీ పార్క్ మాట్లాడుతూ ఈ పోటీలో పాల్గొని తమ ఇంక్యుబేషన్ ప్రోగ్రాంను విజయవంతంగా ప్రదర్శించిన మొదటి నలుగురికి రూ.కోటి గ్రాంట్ లభిస్తుందన్నారు. పోటీలో పాల్గొనే వారికి ఐఐటి ఢిల్లీ అధ్యాపకుల నుండి ప్రాజెక్టుల నిర్వహణకు నిపుణుల మార్గదర్శకాలు లభిస్తాయన్నారు.ఆరు నెలల పాటు జరిగే కార్యక్రమంలో 14-22 ఏళ్ల విద్యార్థుల సాంకేతిక ఆలోచనలు అందించాల్సిందిగా ఆహ్వానిస్తున్నామన్నారు.

3 నుంచి ఉచిత మార్షల్ ఆర్ట్స్ శిక్షణ

ప్రజాశక్తి- చోడవరం రూరల్: జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈనెల 3 నుంచి నెల రోజులు పాటు చోడవరం గణేష్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో వుషూ మార్షల్ ఆర్ట్స్‌లో 16 ఏళ్లలోపు బాల బాలికలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లుగణేష్ డిఫెన్స్ అకాడమీ డైరెక్టర్ పుల్లేటి గణేష్ తెలిపారు. ప్రతిరోజు ఉదయం 6 గంటల నుండి ఎనిమిది గంటలకు వరకు సాయంత్రం ఐదు గంటల నుండి 6 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు.

శిక్షణ అనంతరం అనకాపల్లి జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ద్వారా ధ్రువపత్రాలు అందజేస్తామని జిల్లా క్రీడా అధికారి రమణ తెలిపారు. ఆసక్తి కలిగిన బాల బాలికలు ఆధార్ కార్డు జిరాక్స్, రెండు ఫోటోలతో గణేష్ డిఫెన్స్ అకాడమీని సంప్రదించాలని గణేష్ సూచించారు. ఇతర వివరాలకు 9642081090, 81069 01731 ఫోను నెంబర్లకు సంప్రదించాలన్నారు.

కిక్ బాక్సింగ్‌లో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి -అనకాపల్లి : శరీర దృఢత్వానికి మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహద పడతా యని మార్షల్ ఆర్ట్స్ కోచ్ ఉమావెంకట మహేశ్వరరావు తెలిపారు. జిల్లా క్రీడాసాధికార సంస్థ పర్యవేక్షణలో స్థానిక ఉడ్‌పేట అప్పర్ ప్రైమరీ స్కూల్ ప్రాంగణంలో స్పోర్ట్స్ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆఫ్ అనకాపల్లి ఆధ్వర్యంలో వచ్చేనెల ఒకటవ తేదీ వరకు ఉచితంగా కరాటే,కిక్ బాక్సింగ్‌లో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.. ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుండి 8 గంటల వరకు బాల బాలికలు, యువకులకు శిక్షణా తరగతులు ఉంటా యన్నారు.ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ వినియోగించు కోవాలన్నారు.ఆసక్తి గలవారు 9704471628 నెంబరుకు సంప్రదించాలని సూచించారు.

కార్పెంటర్ సామగ్రి అందజేత

కార్పెంటర్‌కు వృత్తి సామగ్రిని అందజేస్తున్న బంగారు రాజు

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని తాటితూరుకు చెందిన నిరుపేద కార్పెంటర్ వై.తరుణ్‌కు అదే గ్రామానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు బలభద్రుని బంగారురాజు గురువారం వృత్తిపరమైన సామగ్రిని అందజేశారు. తన సొంత నిధులతో సమకూర్చిన కటింగ్ మిషన్, హ్యాండ్ చిత్రీ మిషన్, ఔటర్ మిషన్, డ్రిల్లింగ్ మిషన్లు బంగారు రాజు అందజేశారు. ఇందుకు గాను కార్పెంటర్ తరుణ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు బలభద్రుని శ్రీనివాసరావు, వ్యవస్థాపకులు పల్లంటి.శ్యామ్ సుందర్, ప్రతినిధి మద్దిల గురునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణా శిబిరాలు

ప్రజాశక్తి -ములగాడ : ఆంగ్ల భాషా పరిజ్ఞానం వల్ల మరిన్ని విషయాలను తెలుసుకోగలమని, తద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోగలమని యువజన నాయకులు బాల అన్నారు. మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో గురువారం ఆయన స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇంగ్లీషు నేర్చుకోవడం వల్ల ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని, ప్రపంచ జ్ఞానం పెరుగుతుందని తెలిపారు. సులభమైన పద్ధతిలో ఇంగ్లీషును ఎలా నేర్చుకోవాలో బాలలకు తెలియజేశారు. గ్రంథాలయాధికారి వి.అజయ్‌కుమార్ మాట్లాడుతూ, స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, వీటిని నిర్వహించడానికి స్థానిక యువకులు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. అనంతరం నాట్యం, యోగాలో బాలలకు శిక్షణ కొనసాగించారు. కార్యక్రమంలో శేషు, జాతీయ సేవా పథక వాలంటీర్లు, గ్రంథాలయ పాఠకులు, బాలలు పాల్గొన్నారు.

సబ్బవరంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:స్థానిక శాఖా గ్రంథాలయాధికారి పి.దమయంతి ఆధ్వర్యాన వేసవి శిక్షణ శిబిరం కొనసాగింది. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి విద్యార్థులకు కథలను చెప్పించారు. పిల్లలచేత మాస్ రీడింగ్ చేయించారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు పి.ప్రభాకర్ మాట్లాడుతూ కథల్లో నీతిని వివరించారు.

చీడికాడ:విద్యార్థుల మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం పెరగడానికి క్రీడలు ఎంతో అవసరం అని లైబ్రేరియన్ జోగేశ్వరి అన్నారు.మండల కేంద్రంలో స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కథలు చదివించారు.

నక్కపల్లి:మండలంలోని చినదొడ్డిగాల్లు శాఖ గ్రంథాలయం లో వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా గ్రంథాలయ అధికారి జనార్దన్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు దస్తూరి పోటీలు నిర్వహించారు. పలువురు విద్యార్థులు దస్తూరి పోటీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులతో నీతి కథలు చదివించి, నీతిని బోధించారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

సబ్బవరం : పుస్తక పఠనంతో విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని గ్రంథాలయం అధికారి వి.శిరీష అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం కార్యక్రమంలో భాగంగా గురువారం విద్యార్థులకు న్యూస్ పేపర్ చదవడం, ఖోఖో క్రీడా పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో రిటైర్ అధికారి రత్నకుమార్, విద్యార్థులు,పాఠకులు పాల్గొన్నారు.

డొంకాడలో డ్రెయినేజీ పూడికతీత పనులు

- ప్రజాశక్తి వార్తకు స్పందన

పూడికతీత పనులు పరిశీలిస్తున్న ఎంపిడిఒ సీతారామరాజు

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని డొంకాడ దళిత కాలనీలో డ్రెయినేజీలో పూడిక తీత పనులు చేపట్టారు. డ్రెనేజీ వ్యవస్థ సక్రమంగా లేనందున వర్షం కురిసినప్పుడల్లా ఇళ్లల్లోకి వర్షపు నీరు వచ్చి చేరుతుంది. సోమ, బుధవారం కురిసిన వర్షానికి ఇళ్లల్లోకి నీరు చేరడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇళ్లల్లోకి చేరిన వర్షపు నీరును బయటకు తోడుకున్నారు. ఇళ్లల్లోకి చేరిన వర్షపు నీరు అనే శీర్షిక బుధవారం ప్రజాశక్తిలో ప్రచురించడం, ఇటీవల సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు కాలనీ వాసులతో కలిసి డ్రైనేజీ ని పరిశీలించి వెంటనే డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని డిమాండ్ చేయడంతో ఎంపీడీవో సీతారామరాజు స్పందించి గురువారం డొంకాడలో డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. సర్పంచ్ చందిన కొండలరావు, పంచాయతీ కార్యదర్శి మీనాక్షి ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులతో డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగింపు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సీతారామరాజు మాట్లాడుతూ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ కల్వర్టు నిర్మాణానికి 3 లక్షలు ఎంపీటీసీ నిధుల నుండి మంజూరు చేశారని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. కల్వర్టు నిర్మాణం చేపడితే కాలువలో నీరు నిల్వ లేకుండా బయటకు పోతుందని, ఇకనుంచి వర్షం వచ్చినా ఎటువంటి ఇబ్బంది ఉండదని ఎంపిడిఒ సీతారామరాజు తెలిపారు.

ఏషియన్ రోలర్ స్కేటింగ్ పోటీలకు దీపిక

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:దక్షిణ కొరియాలో జులై 20 నుంచి 30వ తేదీ వరకు జరిగే 20వ ఏషియన్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌కు నర్సీపట్నంకు చెందిన క్రీడాకారిణి పెదిరెడ్ల చైత్రదీపిక ఎంపికైంది. గత నెల 16 నుంచి 30వ తేదీ వరకు మొహాలీ, పంజాబ్‌లో జరిగిన భారత ఆర్టిస్టిక్ రోలర్ స్కేటింగ్ జట్టు ఎంపిక పోటీలో చైత్రదీపిక యూత్ కేటగిరి పెయిర్ స్కేటింగ్‌లో మెరుగైన ప్రతిభ చాటి భారత జట్టులో స్థానం సాధించింది. భారతదేశం తరపున స్కేటింగ్‌లో అంతర్జాతీయ స్థాయిలో రాణించి ఎక్కువ పతకాలు సాధించి దేశానికి, రాష్ట్రానికి, జిల్లాకు ఎంతో పేరుతేవాలని పలువురు అధికారులు, ప్రజాప్రతినిదులు, క్రీడాభిమానులు, స్నేహితులు, ప్రవాస ఆంధ్రులు, కుటుంబ సభ్యులు ఆకాంక్షించారు.

ఉద్యోగాల పేరిట మోసగించిన కేసులో

ఇద్దరు నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి-కొత్తకోట:ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులను నమ్మించి లక్షలాది రూపాయలు వసూలు చేసి పరారిలో ఉన్న ఇద్దరు మోసగాళ్లను అరెస్టు చేసి కోర్టుకు తరలించామని కొత్తకోట ఎస్సై ఎం శ్రీనివాస్ గురు వారం తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. కాకినాడ జిల్లా కోటనందూరుకు చెందిన కసిరెడ్డి విద్యా సాగర్ తనను తాను మండల అభివృద్ధి అధికారి (ఎం పి డివో) గా పరిచయం చేసుకుంటూ ఓ కారులో తిరుగుతూ తనకు రాష్ట్ర సెక్రటేరియట్ అధికారుల తో పరిచయాలు ఎక్కువగా ఉన్నాయని, ఎలాంటి ప్రభుత్వ ఉద్యోగాలైనా ఇప్పిస్తా నని, ఎమ్మార్వో పోస్టుకు రూ 25 లక్షలు , వీఆర్వో పోస్టుకు రూ 6 లక్షలు, ఇతర చిన్న ఉద్యోగాలకు రూ మూడు లక్షల ఇస్తే ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి లక్షలు రూపాయిలు దండుకున్నాడన్నారు. కొత్తకోట గ్రామానికి చెందిన నిరుద్యోగ యువత నుంచి సుమారు రూ.32 లక్షల వరకూ పలువురు వద్ద వసూలు చేశారని ఎస్సై చెప్పారు. నెలలు గడుస్తున్నప్పటికీ ఉద్యోగం ఇప్పించక పోవడంతో పాటు ఫోన్ చేస్తే సమాధానం ఇవ్వకపోవడం తో అనుమానంతో కొత్తకోట గ్రామానికి చెందిన రూ 6 లక్షల ఇచ్చి మోసపోయిన బాధితుడు యర్రా శ్రీను ఫిర్యాదు చేసారని ఎస్సై పేర్కొన్నారు. కేసు నమోదు చేసి కసిరెడ్డి విద్యాసాగర్ తో పాటు అతని బంధువు సహాయకుడు కోటనందూరు గ్రామానికి చెందిన మలిచెట్ల శ్రీనును అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించామని ఎస్సై ఎం శ్రీనివాస్ తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-మాడుగుల:మండలంలో వీరవిల్లి అగ్రహారంలో గురువారం కీర్తిశేషులు శ్రీనాథు కనక లక్ష్మి జ్ఞాపకార్థం వారి కుమారుడు రమేష్(ఎస్ఐసీ) సహకారంతో వివిఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వడ్డి సత్యారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది.విశాఖకు చెందిన పలు కార్పొరేట్ ఆసుపత్రుల నుంచి ప్రత్యేక వైద్య నిపుణులు శిబిరంలో రోగులకు ఉచితంగా తనిఖీలు నిర్వహించి మందులు అందజేశారు. రోగులకు గుండె సంబంధిత పరీక్షలు ఈసీజీ, రక్త పరీక్షలు ఉచితంగా చేశారు. పరిసర మండలాల నుండి పెద్ద సంఖ్యలో రోగులు తరలివచ్చారు.సుమారు 350 మందికి వైద్య సేవలు అందించారు. విశాఖ మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆసుపత్రి నుండి ఆంకాలజిస్టులు మురళీకృష్ణ, హారిక, వీఆర్వో పీఎం నాయుడు, ఎన్నారై ఆసుపత్రి నుండి వైద్య నిపుణులు పరమేశ్వరరావు, హరి కిషోర్, సుజిత్ కుమార్, సౌమ్య, హేమంత్,సుజాత తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలు చేస్తున్న వైద్యులు

వెంకటేశ్వర థియేటర్ సీజ్

సీజ్ చేస్తున్న తహశీల్దార్

ప్రజాశక్తి-రావికమతం: మండల కేంద్రంలోని వెంకటేశ్వర టాకీస్ ను తహసిల్దార్ బి.వెంకటరమణ సీజ్ చేశారు. గురువారం ఆయన సినిమా హాలును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గత ఏడాది మే నెలలో థియేటర్లో ప్రదర్శనలకు బీ.ఫామ్ గడువు ముగిసినప్పటికీ నేటికీ కూడా ఈ లైసెన్సును లీజు దారుడు పునరుద్ధించుకోలేదని గుర్తించారు. ఈ కారణంగా ప్రదర్శనలు నిలిపివేయాలని ఆదేశించారు. థియేటర్ పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంపై కూడా ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. టాయిలెట్స్ లో దుర్వాసనపై అసహనం వ్యక్తం చేశారు. ఖాళీ మద్యం బాటిల్లు ఎందుకు ఉన్నాయని లీజుదారుడును ప్రశ్నించారు.

5 నుంచి ఆధార్ శిబిరాలు

ప్రజాశక్తి -మాడుగుల:మండలంలో ఈనెల 5వ తేదీ నుంచి 16వ తేదీ వరకు రెండు విడతలగా ఆధార్ శిబిరాలు నిర్వహించనున్నట్టు ఎండిఓ కొంకి అప్పారావు తెలిపారు.ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈనెల 5 నుంచి 8 వరకు మొదటి విడత, 13 నుంచి 16 వరకు రెండో విడత కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. మండలంలో వీరనారాయణం, ఎల్ పొన్నవోలు, కే వల్లపురం, కే జే పురం గ్రామాల్లో ఈ శిబిరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మండలంలో ప్రజలు ఆయా కేంద్రాల్లో ఆధార్ అప్డేట్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-చీడికాడ:ఆరవ తరగతిలో ప్రవేశాలకు నిర్వహించిన మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల అయ్యాయని ఆదర్శ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు చరకాపు వెంకటలక్ష్మి తెలిపారు పరీక్ష ఫలితాలను పాఠశాలలో ఉంచినట్లు వాటిని చూసుకోవాలని ఆమె పేర్కొన్నారు. విద్యార్థులకు వచ్చిన మార్కులు, మెరిట్, రోస్టర్ ఆధారంగా త్వరలో అర్హత జాబితా ఆధారంగా విద్యార్థులకు సమాచారం తెలియజేస్తామని హెచ్ఎం తెలియజేశారు.

పరీక్షిస్తున్న వైద్యులు

విరాళాన్ని ఇస్తున్న దాతలు

ఆలయానికి విరాళం అందజేత

ప్రజాశక్తి -రావికమతం: మండలంలో గుడ్డిప గ్రామంలో నిర్మాణంలో ఉన్న భూలోకమ్మ అమ్మవారి గుడి నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన గల్లా అప్పారావు, నాగమణి దంపతుల కుమారులు గల్లా చిరంజీవి, గల్లా నాగేశ్వరావులు రూ.5116 విరాళాన్ని అందజేయడం జరిగిందని గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు మజ్జి అప్పారావు (కొండయ్య) తెలిపారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ, విరాళం అందించడం ఎంతో సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లా రమణ, గల్లా స్వామి, మర్రిసా నాగేశ్వరరావు, పెద్దడ అప్పారావు పాల్గొన్నారు.

వైసిపి నేతను పరామర్శించిన వీసం

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని డిఎల్ పురం గ్రామానికి చెందిన వైసిపి నేత, జిల్లా పరిషత్తు కో ఆప్షన్ సభ్యులు లొడగల చంద్రరావును గురువారం కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, వైసిపి నేత వీసం రామకృష్ణ పరామర్శించారు. లోడగల చంద్రరావు ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకుని, ఇంటి వద్ద కోరుకుంటున్నారు. ఈ మేరకు ఆయన్ను రామకృష్ణ కలిసి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు.



పరామర్శిస్తున్న వైసిపి నేత రామకృష్ణ

రికార్డులు తనిఖీ

ప్రజాశక్తి- కోటవురట్ల:మండల కేంద్రంలో పశు ఆరోగ్య సేవ వాహన రికార్డులను గురువారం పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ నరేష్ తనిఖీ చేశారు. వాహనం ద్వారా నిత్యం రైతులకు అందిస్తున్న సేవలు గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందజేస్తున్న మందుల వివరాలు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నిరంతరం అందుబాటులో ఉండాలని వాహన సిబ్బందికి సూచించారు.

రికార్డులు తనిఖీ చేస్తున్న నరేష్

వైద్య శిబిరాలు ఏర్పాటు

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని బుచ్చంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి గురువారం మండలంలోని గిరిజన గ్రామాలైన గదబపాలెం, గుర్రాలబైలు, అర్ల, పనసలపాడు, గంగవరం గ్రామాలలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ ఈఓ నూకరాజు, హెచ్ఎస్ రమాకాంతరావు, హెచ్‌వి సన్యాసమ్మ, ఆశలు పాల్గొన్నారు.

జనసేన నేతలకు కిట్లు పంపిణీ

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లి సుబ్బరామిరెడ్డి కళ్యాణ మండపంలో గురువారం పాయకరావుపేట నియోజకవర్గం జనసేన పార్టీ క్రియాశీలక కిట్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పౌర సరఫరాల కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివదత్ మాట్లాడుతూ క్రియాశీలక సభ్యత్వాల నమోదు ప్రక్రియలో క్రియాశీలక పాత్ర పోషించిన వారిని అభినందించి, కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఆకేటి గోవిందరావు, పేర్ల మాధవ, మాకినీడు చిట్టిబాబు, దేవవరపు రఘు, పాము గణేష్, కురుందాసు అప్పలరాజు, వెలగా సుధాకర్ పాల్గొన్నారు.

ఊరూవాడా మేడే పతాకావిష్కరణలు

నర్సీపట్నంలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

ప్రజాశక్తి- అనకాపల్లి : కార్మిక హక్కుల పరిరక్షణకు ఐక్యపోరాటాలకు సిద్ధంగా ఉండాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.లోకనాథం పిలుపునిచ్చారు. ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలన్నారు. గురువారం మేడే సందర్భంగా స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద కార్మిక జెండాను ఆవిష్కరించారు. ఎపిఇపిడిసిఎల్ వద్ద సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. శంకరరావు, బేవరేస్ ఎంప్లాయిస్ యూనియన్ వద్ద గంటా శ్రీరామ్, కొండారావు, మున్సిపల్ కార్యాలయం వద్ద వై.ఏసురాజు, బాటా సెంటర్ వద్ద ముఠా కార్మిక సంఘం నాయకులు భీశెట్టి అప్పారావు, ఆర్ఎఆర్ఎస్ వద్ద కె. నందేశ్వరరావు, బైపాస్ వద్ద ట్రాఫిక్ ఎస్ఐ శేఖర్ రావు, మందా రాము,కార్మికుల సెంటర్లో పెయింటర్ సీనియర్ అధ్యక్షులు సూర్యనారాయణ, తగరంపూడి పిహెచ్‌సి వద్ద కాళ్ల తేలయ్య బాబు, బిఎస్ఎన్ఎల్ ఆఫీస్ వద్ద యూనియన్ నాయకులు అప్పారావు, పార్సిల్ వర్కర్స్ యూనియన్ వద్ద రుత్తల పైడితల్లి, ఆర్టీసీ డిపో వద్ద పలక సత్యనారాయణ పట్టణంలో 13కేంద్రాల వద్ద కార్మికజెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బిస్కెట్లు మజ్జిగ పంపిణీ చేశారు. బాటా సెంటర్ నుంచి నాలుగు రోడ్ల వరకు భారీ ర్యాలీ చేసి అక్కడ బహిరంగ సభ నిర్వహించారు

మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్.శంకరరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం, కాంట్రాక్టుకార్మికుల రెగ్యులరైజేషన్ చేయాలన్నారు. బేవరేజెస్ డిపో వద్ద సిఐటియు నాయకులు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ మేడే స్ఫూర్తితో లేబర్ కోడ్స్ రద్దు, ఇతర కార్మిక హక్కుల సాధనకు ఈనెల 20న బంద్ జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో టి.సురేశ్, వారాది సత్యనారాయణ, మంద రాము, కాంద్రేగుల రాంబాబు, యర్రంశెట్టి శివకుమార్, సంతోష్, అజయ్, నూకరాజు,కె. అప్పలరాజు, మజ్జి శంకర్రావు, పి.ఎన్.వి పరమేశ్వరరావు, అల్లు రాజు, చలపతి, బి.నూక అప్పారావు, కె. తేలయ్యబాబు, అప్పారావు, సూర్యనారాయణ, సూర్యకళ, రమణమ్మ ఎర్రబెల్లి అప్పారావు పాల్గొన్నారు.

ఆమ్ ఆద్మీ ఆధ్వర్యంలోభవన నిర్మాణ కార్మికులకు కొణతాల హరినాథ్ బాబు మిఠాయిలు పంచిపెట్టారు.

వయోవద్ధుల సంక్షేమ సంఘం, అధ్యక్షుడు కాంద్రేగుల అప్పారావు (కెప్టెన్ అప్పారావు), ప్రజా రాజకీయ వేదిక కన్వీనర్ కనిశెట్టి సురేష్ బాబు ఆధ్వర్యంలో గవరపాలెం గహనిర్మాణ కార్మికులతో మేడే జరుపుకున్నారు. ఎఐఎఫ్‌టియు, ఎపి రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో బవులవాడ,మామిడి పాలెం, మాకవరం, గుంకల్లోవ, దర్జీ నగం లలో ఎర్రజెండాలు ఆవిష్కరించారు. అనకాపల్లిలో గుండాల జంక్షన్ నుండి నెహ్రూ చౌక్ మీదుగా ఎపిఇఎఫ్ హాల్ వరకు ర్యాలీ నిర్వహించారు. రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహనరావు, వి శివాజీరావు, ఒ. లక్ష్మీ కుమారి పాల్గొన్నారు. 'మేడే సంక్షిప్త చరిత్ర" పుస్తకాన్ని ఆవిష్కరించారు.

కశింకోట: తాళ్ళపాలెం జంక్షన్‌లో మేడే వేడుకల్లో సిఐటియు జిల్లా నాయకులు డి శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా నాయకులు డిడి వరలక్ష్మి, గుమ్మడి నారాయణరావు, లోవరాజు, ప్రకాష్, అప్పారావు, సత్తి బాబు, నాయడు, రెహమాన్, శాంతి, రమణమ్మ, నూకరత్నం, పద్మా, దేవి పాల్గొన్నారు.

రావికమతంలో...

యులమంచిలి : మేడే సందర్భంగా ఎల్ఐసి ఆఫీసు నుండా బస్టాండ్ వరకు సిఐటియు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్మిక జెండా ఆవిష్కరణలో సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్ శివాజీ, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, సిఐటియు నాయకులు శ్రీనివాస్, నగిరెడ్డి సత్యనారాయణ, లక్ష్మి, రేవతి, జ్యోతి, రుత్తల సత్యనారాయణ, చిరంజీవి పాల్గొన్నారు.

దేవరాపల్లి: స్థానికనాలుగు రోడ్ల కూడలిలో బిల్డింగ్ వర్క్స్ యూనియన్ అధ్యక్షులు టి.చంటి యం,గంగాధర్ కార్మికజెండా ఎగురవేశారు. వ్యవసాయకార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి వెంకన్న, సిఐటియు మండల కార్యదర్శి కె సూరిబాబు జి రాము పి ఈశ్వరావు టి ప్రసాద్ యు శ్రీను యస్ కొండబాబు పాల్గొన్నారు.

పరవాడ : సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో మేడే సందర్బంగా కార్మిక పతాకావిష్కరణలు జరిగాయి. ఫార్మా సిటీ విజయశ్రీ స్టాప్ అండ్ వర్కర్స్ యూనియన్ వద్ద కృష్ణ. బైకాన్ స్టాప్ అండ్ వర్కర్ యూనియన్‌వద్ద బాబురావు ఆవిష్కరించారు. ఐజసి వద్ద ముఠా వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కర్రి పోతునాయుడు, సింహాద్రి జంక్షన్లో ముఠా వర్కర్స్ నాగప్పరావు ఆవిష్కరించారు. రాంకీ ఎస్‌సిజడ్ వద్ద

నక్కపల్లి లో...

ఎస్ శ్రీను ఆవిష్కరించారు. కొత్తపాలెం ముఠా వర్కర్స్ యూనియన్ వద్ద కె..రమణ, ఎన్‌టిపిసి వద్ద వెంకటేశ్వర నాయక్, వాడచీపురపల్లిలో సన్నిబాబు, భాషా, తిక్కవానిపాలెంలో సోమేష్, పరవాడ సినిమాహాల్ జంక్షన్ వద్ద జి.అప్పారావు, సబ్‌స్టేషన్ వద్ద వెంకన్న తహశీల్దార్ కార్యాలయం వద్ద వై.బాబూరావు, గీతాంజలి నగర్‌లో డి చంద్రరావు కార్మిక పతకాలను ఆవిష్కరించారు. సిఐటియూ జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ పోరాడి సాధించిన కార్మిక హక్కులు పరిరక్షణకు ఈనెల 20న సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి మాణిక్యం ఆర్ శంకరరావు, మండల కన్వీనర్ ఎం రమణి పాల్గొన్నారు.

చోడవరం : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో మేడే పతాకావిష్కరణలో సిఐటియు జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు, ఎండిఎం రాష్ట్ర అధ్యక్షులు గూడూరు వరలక్ష్మి , ఎల్ఐసి యూనియన్ నాయకులు వై లోవరాజు, యుటిఎఫ్ నాయకులు గొంది చిన్నబ్బాయి, కె గోవిందు పాల్గొన్నారు. నర్సయ్యపేట నుంచి కొత్తూరు జంక్షన్ వరకు భారీ కార్మిక ప్రదర్శన అనంతరం కొత్తూరు జంక్షన్లో మానవహారం నిర్వహించారు కార్యక్రమంలో కె. వరలక్ష్మి బి రామలక్ష్మి, కాంతం, రాము, వెంకట్రావు నాయుడు ఉమాకృష్ణ పాల్గొన్నారు,.

చోడవరం రూరల్ :కొత్తూరు జంక్షన్‌లో పుచ్చలపల్లి సుందరయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కొత్తూరు జంక్షన్‌లో సిపిఎం నాయకులు నాగిరెడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. చోడవరం విద్యుత్ కార్యాలయం వద్ద యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో యూనియన్ పతాకాన్ని రాష్ట్ర ఉపాధ్యక్షులు వేపాడ సత్యనారాయణ ఎగరవేశారు. నాయకులు ప్రేమ చంద్రశేఖర్, రాంబాబు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మేడే సందర్భంగా రాజాంలో నాగులాపల్లి సత్యనారాయణ విగ్రహానికి నివాళులర్పించారు. మాజీ ఎంపిటిసి మరిసా సతీష్, మరిసా నరేష్, మరిసా నాగ అప్పారావు, కొయ్య శ్రీనివాస్, ఆకుల నాగేశ్వరరావు, ఎల్ శ్రీనివాస్ పాల్గొన్నారు

మునగపాక: స్థానిక మెయిన్ రోడ్ ఎస్‌బిఐ సెంటర్ వద్ద సిఐటియు నాయకులు ఎస్ బ్రహ్మాజీ, ఆటో స్టాండ్ వద్ద ఆటో యూనియన్ అధ్యక్షులు ఇంటి శ్రీను, చూచుకొండలో సిపిఎం నాయకులు కర్రి అప్పారావు, తోటాడ సెంటర్ వద్ద సిఐటియు నాయకులు కాంద్రేగుల రాము, ఎఐటియుసి నాయకులు వైయస్ భద్రం, నాయుడు మల్లికార్జునరావు కార్మిక పతకాన్ని ఆవిష్కరించారు. ఆళ్లమహేశ్వరరావు, పెంటకోట సత్యనారాయణ, పార్వతి, కాంద్రేగుల నాయుడు, ఆడారి వినయ్, కాంద్రేగుల సునీల్ కుమార్, పరదేశి, సరగడం సుబ్రహ్మణ్యం, మద్దాల రాము, మొల్లేటి వాసు, సత్యనారాయణ, గోవిందరావు పాల్గొన్నారు.

రాంబిల్లి : మండలంలోని కొత్తపట్నం, నావిగేట్, రాంబిల్లి, గజ రెడ్డిపాలెం, లోవపాలెం, మామిడి వాడ, భోగాపురం, వెంకటాపురం, వై లోవ, పెద్ద కలవలపల్లి,

మాడుగులలో...

వెల్చూరు కేంద్రాలలో మేడే జెండా ఆవిష్కరణలు జరిగాయి. నేవీ మెయిన్ గేట్ నుండి, రాంబిల్లి మండలపరిషత్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి దేవుడునాయుడు సిఐటియు నాయకులు రామకృష్ణ,నారాయణ రావు, కాశయ్య, గంగరాజు, నూకన్నా, రాము, భాస్కరరావు, రమణ, శ్రీను, గోవింద్, కృష్ణ, ముసలయ్య, పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక సిఐటియు కార్యాలయం ఆవరణలో కార్మిక పతకాన్ని సిఐటియు జిల్లా నాయకులు సుజాత ఆవిష్కరించారు. సినిమాహాలు సెంటర్, ఆటో స్టాండ్,

పరవాడలో...

దుర్గమాంబ ముఠా కళాసి సంఘం కార్యాలయం, దుర్గమాంబ బిల్డింగ్ వర్కర్స్ కార్యాలయం వద్ద మేడే వేడుకలు జరిగాయి. సిఐటియు మండల నాయకులు ఉప్పాడ సత్యవతి, దుర్గమాంబ ముఠా కళాసి సంఘం అధ్యక్షుడు బర్ల రమణ, వివి రమణమ్మ, గొంతిన అప్పారావు(చంటి) కె.కోటేశ్వరావు, పప్పుల కోటి, ఎం. గౌరేశ్వరరావు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్:మే డే స్ఫూర్తితో లేబర్ కోడ్స్ రద్దుకై పోరాడుదామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు జీ.కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను సిఐటియు అద్వర్యంలో గురువారం నర్సీపట్నం మున్సిపాలిటీ పెదబొడ్డేపల్లి, పాత మున్సిపల్ కార్యాలయం, శివపురం, కృష్ణాబజార్, బలిఘట్టం, కళాసి కాలనీ, జిసిసి బంకు, ఆటో స్టేండ్, ఇందిరా మార్కెట్ సెంటర్లులో సిఐటియు పతాకా విష్కరణలు చేశారు.ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ, మేడే స్ఫూర్తితో కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలన్నారు. స్వాతంత్రం పూర్వం పోరాడి సాదించుకున్న కార్మిక చట్టాలను బిజేపి ప్రభుత్వం యూజమాన్యంకు మేలు చేసేందుకు నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చిందన్నారు. దీంతో కార్మికులు సంఘం పెట్టుకునే హక్కు కనీస వేతనం హక్కు సమ్మె హక్కులు, తదితర చట్టాలు రద్దుకాబోతాయన్నారు. అలాగే భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు చట్టం రద్దు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, కెవి.సూర్యప్రభ, ఎల్ గౌరి, కే.రామకృష్ణ, రుత్తల గోవింద్, కార్మికులు పాల్గొన్నారు.

నక్కపల్లి :మండలంలోని సిఐటియు ఆధ్వర్యంలో పలుచోట్ల ఆటో, భవన నిర్మాణ కార్మికులు, పెయింటింగ్ కార్మికులు, అంగన్వాడీ వర్కర్స్ ఘనంగా ప్రపంచ కార్మిక దినోత్సవం నిర్వహించారు.ఆయా కేంద్రాల్లో సిఐటియు

చోడవరంలో...

జెండాలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, సిఐటియు మండల కన్వీనర్ ఎం.రాజేష్, సిఐటియు జిల్లా నాయకులు ఎం.దుర్గారాణి మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్స్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు గిరి, పి.శ్రీను, నాగు, వెంకటేశ్వరరావు, బుజ్జి, కనకరాజు, లోవరాజు, అప్పారావు, దేవుళ్ళు, ప్రసాద్, నాయుడు పాల్గొన్నారు.

నక్కపల్లి:నక్కపల్లిలో ఎంపీడీవో సీతారామరాజు ఆధ్వర్యంలో ప్రపంచ కార్మిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది, ఉపాధి సిబ్బంది, ఉపాధి శ్రామికులతో కలిసి ర్యాలీ చేపట్టారు.

కొత్తకోట:రావికమతం మండలం కొత్తకోటలో సిఐటి యు, శ్రీ శాంతి ఆటో యూనియన్, శ్రీ వర సిద్ధి వినాయక ప్లంబర్ అండ్ ఎలక్ట్రీషియన్ సంఘం, రిక్షా యూనియన్ సభ్యులు ఆధ్వర్యంలో మే డే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. స్థానిక పశు వైద్యశాల వద్ద సిఐటియు జెండాను ఆవిష్కరణ చేసారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కె. గోవిందరావు, శ్రీ శాంతి ఆటో యూనియన్ అధ్యక్షులు బి.బుల్లిబాబు, శ్రీ వర సిద్ధి వినాయక సంఘం అధ్యక్షులు డి.సత్తిబాబు, పులగం రమనాజీ, కెవిపిఎస్ జిల్లా చిరంజీవి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు..

రావికమతం:మండల కేంద్రంలో సిఐటియు మండల కార్యదర్శి వి.సత్యవతి ఆధ్వర్యంలో మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. జెండాను ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, ముఠా కార్మికులు, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

మాడుగుల :స్థానిక బస్ స్టాండ్ వద్ద మేడే ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాడుగుల ఎంపీడీవో కోంకి. అప్పారావు, సిఐటియు మండల నాయకుడు ఇరట నరసింహమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు కే భవాని, పంచాయతీ యూనియన్ గ్రీన్ అంబాసిడర్ క్లాత్ మిత్ర ఏలుచూరి ఈశ్వరరావు పాల్గొన్నారు.

అనకాపల్లిడెస్క్:గొలుగొండ మండలం జోగంపేట సెంటర్లో సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో మేడే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు ఎం.రామకృష్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. సిఐటియు జిల్లా నాయకులు కె.త్రిమూర్తులురెడ్డి మాట్లాడుతూ, పాలకుల కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమించాలని కార్మికులకు పిలుపునిచ్చారు. సీనియర్ నాయకులు సాపిరెడ్డి నారాయణమూర్తి, వివిధ సంఘాల కార్మికులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: కార్మిక చట్టాల అమలుకు మనమంతా కృషి చేయాలని సిఐటియు జిల్లా నేత ఈశ్వరరావు తెలిపారు.అడ్డురోడ్డులో ముఠా కార్మిక సంఘం నిర్వహించిన మేడేలో పాల్గొన్నారు. ముఠా కార్మిక సంఘం అధ్యక్షుడు నరాలశెట్టి నాగేశ్వరరావు, వ్యకాస జిల్లా అధ్యక్షుడు సత్యన్నారాయణ, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నానాజీ, ముఠా కార్మిక సంఘం మాజీ అధ్యక్షుడు త్రిమూర్తులు, రిక్షా కార్మిక సంఘం అధ్యక్షులు కాతా వీర్రాజు పాల్గొన్నారు.

రాంబిల్లిలో...